
తీన్మార్
విలేకరులు కావలెను
పత్రిక రంగంలో మరో సంచలనం, వినూత్న రీతిలో వెలుబడతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో పని చేయుటకు
జిల్లా బ్యూరో చీఫ్ లు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు,
జిల్లా క్రైమ్ రిపోర్టలు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించగలరు
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత,
కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.
ఈ క్రింది నెంబర్ల ను ఫోన్ ద్వారా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించగలరు
9177108128, 9966847463

# తీన్మార్
నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక
teenmaardesk@gmail.com
for e-paper scan now
ములుగు | సంపుటి : 02 | సంచిక : 281 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 23 జనవరి 2024 | పేజీలు : 08 | వెల ₹5
Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.




## గొర్రెల పంపిణీలో
# కోట్ల స్కాం!

పంపిణీదారుల పేరుతో నిధులు స్వాహా
పశుసంవర్ధక శాఖలో అక్రమాలపై ఏసీబీ కేసు

## పూలే విగ్రహం ఏర్పాటు చేయడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదా

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత



2 లో..

## కేసీఆర్ కుటుంబం తర్వాత జైలుకు వెళ్లేది మాజీ మంత్రి జగదీష్‌రెడ్డే

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



2 లో..



### నాగార్జునసాగర్ ప్రధాన డ్యాంపై
## నెలకొన్న ఉద్రిక్తత

సీఆర్‌పీఎఫ్ బలగాలు అడ్డుకున్న ఎన్ఎస్పీ ఉద్యోగులు, ఇంజినీర్లు

ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలు ఎవరివనేదానిపై లేని స్పష్టత

.. వివరాలు 2లో

### మద్యం ధరలను పెంపుపై సచివాలయంలో
## సమీక్షా సమావేశం

ఆదాయాన్ని పెంచే మార్గాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రివ్యూ



2లో..

## ప్రొఫెసర్ కోదండరాంతో బర్రెలక్క కీలక సమావేశం

పార్లమెంట్ స్థానం నుంచి బరిలో ఉంటా : బర్రెలక్క



2 లో..

## పోర్టల్‌లో లోపాలు, సవరణలపై చర్చించిన ధరణి కమిటీ

ధరణితో లింక్ ఉన్న అని శాఖల ఒపీనియన్ తీసుకుంటాం

గత ప్రభుత్వం చేసిన చట్టాల్లో అనేక లోపాలున్నాయి

తాత్కాలికంగా, దీర్ఘకాలిక అంశాలను పరిశీలిస్తాం

కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి



.. వివరాలు 2లో

### ఎమ్మెల్సీలుగా మహేష్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్ ఏకగ్రీవం



2

## వ్యక్తిగత పనులు చేయించుకోవడానికే సలహాదారులన నియామకం

సలహాదారులను నియామకంపై బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శలు



2 లో..

# మద్యం ధరలను పెంపుపై సచివాలయంలో సమీక్షా సమావేశం



తెలంగాణ బ్యూరో, జనవరి 22 (తీన్మార్ న్యూస్): రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే విభాగాల్లో ఒకటైన ఎక్సయిజ్ డిపార్టుమెంటుపై ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సచివాలయంలో సోమవారం సమీక్ష చేస్తూ ఈసారి మద్యం ధరలను పెంచకుండా ఆదాయాన్ని పెంపొందించుకునే మార్గాలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రివ్యూ చేశారు. మద్యం ధరలను పెంచి ప్రజలపై భారం వేయాలన్న ఆలోచన లేదని ఎక్సయిజ్ అధికారులకు స్పష్టం చేసిన ఆయన.. లీకేజీలకు తావులేకుండా రెవెన్యూ వసూళ్ళ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. ఎలైట్ బార్, షాపులను ఏర్పాటు చేయడానికి ఏకీకృత విధానం ఉండేలా పకడ్బందీ మెకానిజాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారి లేకుండా చేయాలని, ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తున్నందున తనిఖీలు ముమ్మరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ఎక్సయిజ్ శాఖతో పాటు పోలీసులు, పౌర సంబంధాల శాఖ సిబ్బందితో మల్టీ డైమెన్షనల్ టీమ్ వ్యవస్థను నెలకొల్పాలని సూచించారు. డ్రగ్స్ రవాణా చేసేందుకు అనుసరిస్తున్న అడ్డదారులను అరికట్టడంతో పాటు పౌర సంబంధాల శాఖ ద్వారా ఆ వ్యసనంతో ఏర్పడే దుష్పరిణామాలపై వివిధ సెక్షన్ల ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం ఉమ్మడిగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఎక్సయిజ్ చెక్ పోస్టులను పటిష్టం చేసేలా, సొంత భవనాల్లోనే కార్యాలయాలు పనిచేసేలా పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని, వీటికి అవసరమైన నిధులను రానున్న బడ్జెట్‌లో కేటాయించుకునేలా ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాధాన్యత కలిగిన పర్యాటక క్షేత్రాలు, కేంద్రాలు ఉన్నాయని, కానీ ఇంతకాలం వాటిపై తగిన శ్రద్ధ పెట్టని కారణంగా ప్రపంచానికి పరిచయం చేయలేకపోయామని, నిర్దిష్టమైన మార్కెటింగ్ విధానాలను రూపొందించి టూరిజం రంగాన్ని తీర్చిద్దిదాలని ఆ శాఖ ఆఫీసర్లకు సూచించారు. పురాతన కట్టడాలు, దేవస్థానాలు ఉన్న ప్రాంతాల్లో టెంపుల్ టూరిజంను పెంచాలని, పర్యావరణ వాతావరణం ఉన్నచోట్ల ఎకో టూరిజంను డెవలప్ చేయాలన్నారు. ఇందుకోసం టూరిజం డిపార్టుమెంటుతో పాటు ఆర్టీసీ, ఫారెస్టు, రవాణా, ఇతర శాఖల సహకారాన్ని తీసుకోవాలన్నారు. సహజసిద్ధమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నా విస్తృత ప్రచారం కల్పించకపోవడంతో టూరిస్టులను ఆకర్షించలేకపోతున్నామని అన్నారు. పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాలను అభివృద్ధి చేసేలా సమగ్ర టూరిజం పాలసీని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకెళ్ళేలా ఉండాలన్నారు.

## కేసీఆర్ కుటుంబం తర్వాత జైలుకు వెళ్లేది మాజీ మంత్రి జగదీష్‌రెడ్డే

తెలంగాణ బ్యూరో, జనవరి 22 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ కుటుంబం తర్వాత జైలుకు వెళ్లేది మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. విజిలెన్స్ విచారణ, సిట్టింగ్ జడ్జితో ఎంక్వయిరీని అడ్డుకోలేరని ఆయన నొక్కి చెప్పారు. పూర్తి స్థాయి విచారణ తర్వాత జగదీష్ రెడ్డిని జైలుకు వెళ్లకుండా ఎవ్వరు ఆపలేరని మంత్రి తేల్చి చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్యారాగన్ స్లిప్పర్లు వేసుకున్న వ్యక్తికి ప్రస్తుతం వేల కోట్ల ఆస్తులు, ఫామ్ హౌస్‌లు ఎట్లొచ్చినాయి.. అంటూ ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇక కేసీఆర్ కుటుంబంలో బావ, బామ్మర్ధులు తన్నుకుంటుంటే విషయం బయటికి పొక్కకుండా కేసీఆర్ జాగ్రత్తలు తీసుకునే సమయంలో జగదీష్‌రెడ్డి బ్రోకర్‌లాగా వ్యవహరించాడన్నారు. ఇలాంటి చిల్లర వ్యక్తి నిత్యం ప్రజల్లో, ప్రజల కోసం బతికే తనపై ఆరోపణలు చేయడం విచిత్రంగా ఉన్నదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్గొండ ప్రజలు జగదీష్ రెడ్డిని చూసి నవ్వుకుంటున్నరన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవులను తృణప్రయంగా విసిరికొట్టానని, కానీ జగదీష్‌రెడ్డి మంత్రి పదవి కోసం కేసీఆర్ ఆడించినట్లు ఆడాడన్నారు. మధ్యపాన నిషేదం సమయంలో అక్రమంగా మందు అమ్మి జైలుకు పోయిన జగదీష్ రెడ్డి మాట్లాడటం విడ్డురంగా ఉన్నదన్నారు. ప్రజలు నమస్తే పెడితే ఎక్కడ పని అడుగుతారో అని మోహం కిందకు వేసే అహంకారి ఆరోపణలు చేస్తే తన వ్యక్తిత్వానికి ఎలాంటి నష్టం జరగదని క్లారిటీ ఇచ్చారు. యాదాద్రి విద్యుత్ ప్లాంట్ కుంభకోణం, భద్రాద్రి ప్లాంట్‌లో అక్రమాలు, ఛత్తీస్ ఘడ్ కరెంట్ కొనుగోళ్ల దోపిడీలు బయట పెడుతున్నాననే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తానని మంత్రి పేర్కొన్నారు.

## ప్రొఫెసర్ కోదండరాంతో బర్రెలక్క కీలక సమావేశం



నాగర్ కర్నూల్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంతో బర్రెలక్క కీలక సమావేశమయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఊహించని రీతిలో అత్యధిక ఓట్లు సాధించిన ఆమె ఓటమి తర్వాత కూడా వెనక్కి తగ్గలేదు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో ఉంటానని ప్రకటించిన అనంతరం ప్రొఫెసర్ కోదండరాంతో నిర్వహించిన సమావేశం కీలకంగా మారింది. ఈ సందర్భంగా టీఎస్పీఎస్సీ ద్వారా వేసిన నోటిఫికేషన్ ఆధారంగా వెంటనే పరీక్షలు నిర్వహించాలని ప్రొఫెసర్ కోదండరాం ద్వారా ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల స్థానిక పరిస్థితులను బట్టి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించేలా నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ప్రిపేర్ అయ్యే నిరుపేద నిరుద్యోగుల కోసం ఆయా ప్రాంతాల్లోనే ఉచితంగా కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భైరి రమేష్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు నాగయ్య, తెలంగాణ జన సమితి రంగారెడ్డి జిల్లా కన్వీనర్ దార సత్యం, హైకోర్టు న్యాయవాది రామేశ్వరరావులు పాల్గొన్నారు.

## పూలే విగ్రహం ఏర్పాటు చేయడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదా

హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని రాజకీయాలకు అతీతంగా కోరుతుంటే కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు అంటగట్టడం సరికాదని ఎమ్మెల్సీ కవిత(%మీాజ ఖుజఓ్ట్రు%) అన్నారు. భారత జాగృతి సంస్థ కోరడమే మీకు అభ్యంతరమా? లేక అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేయడమే మీకు అభ్యంతరమా? అని సూటిగా ప్రశ్నించారు. స్ఫూర్తిదాయక వీరులకు మీరు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే జాగృతి సంస్థ ద్వారా పోరాటం చేసి అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయిం చామన్నారు. ఇప్పుడు కూడా అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటు కోసం రాజకీయాలకు అతీతంగా మరో పోరాటాన్ని సాగిస్తామన్నారు.

రాజకీయాల కోసం, సంకుచిత మనస్తత్వంతో ఈ మహా కార్యాన్ని అవహేళన చేయరని ఆశిస్తున్నట్లు చెప్పారు. మహాత్మా జ్యోతిరావు పూలే మహోన్నతుడు, అణగారిన ప్రజల్లో చైతన్యం నింపిన మహా మనిషి. అందుకే ఏప్రిల్ 11 నాటికి పూలే విగ్రహాన్ని తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని భారత జాగృతి తరుపునే కాకుండా యావత్ తెలంగాణ ప్రజల తరుపున వినమ్రంగా మరోసారి కోరుతున్నానని కవిత తెలిపారు.

## నాగార్జునసాగర్ ప్రధాన డ్యాంపై నెలకొన్న ఉద్రిక్తత



తెలంగాణ బ్యూరో, జనవరి 22 (తీన్మార్ న్యూస్): ఆదివారం రాత్రి నుంచి నాగార్జునసాగర్ ప్రధాన డ్యాంపై విధులు నిర్వహిస్తున్న ఎన్ఎస్పీ ఉద్యోగులు, ఇంజినీర్లను సీఆర్‌ఫీఎఫ్ బలగాలు అడ్డుకున్నాయి. దీంతో డ్యాంపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత ఏడాది నవంబరు 29వ తేదీ అర్ధరాత్రి ఏపీ పోలీసులు, నీటి పారుదలశాఖ అధికారులు సాగర్ ప్రధాన డ్యాంపైకి వచ్చి 13వ నంబరు గేటు వరకు ఏపీ పరిధిలోకి వస్తుందంటూ ముళ్ల కంచెను, బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసు బలగాలతో ఏపీ తమ ఆధీనంలోకి తీసుకుంది. దీంతో డ్యాంకు ఇరువైపులా ఏపీ, తెలంగాణ పోలీసు బలగాలు మోహరించడంతో నాగార్జున సాగర్ డ్యామ్ పై హైటెన్షన్ వాతావరణం కొనసాగింది. కేంద్ర జలశక్తి శాఖ జోక్యం చేసుకుని గత డిసెంబర్ 3న ప్రధాన డ్యాంపై ఏపీ, తెలంగాణకు ఇరువైపులా సీఆర్‌పీఎఫ్ బలగాలతో భద్రతను ఏర్పాటు చేశారు. దీంతో సాగర్ డ్యాంను సీఆర్‌పీఎఫ్ బలగాలు అధీనంలోకి తీసుకున్నాయి. అప్పటి నుంచి జనవరి 17వ తేదీ వరకు తెలంగాణ అధికారులను ప్రధాన డ్యాంకు కుడివైపున 13వ నంబరు గేటు అవతలికి సాధారణంగా వెళ్లేందుకు అనుమతిస్తున్నారే తప్పా, విధులు నిర్వహించేందుకు మాత్రం ఏపీ పరిధిలో ఉన్న కంట్రోల్ రూం వద్దకు కూడా రానివ్వలేదు. జనవరి 17న కేంద్ర జలశక్తి శాఖ సమావేశం తరువాత సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా బోర్డు పరిధిలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం సమ్మతించలేదు. అప్పటి నుంచి నిబంధనలు మారాయంటూ సీఆర్పీఎఫ్ బలగాలు ఎన్ఎస్పీ సిబ్బంది, అధికారులను ఏపీ వైపు వెళ్లకుండా 13వ నంబరు గేటు వద్దే నిలిపి వేస్తున్నారు. ఏపీ వైపు ఉన్న కంట్రోల్ రూమ్ వద్దకు సీఆర్పీఎఫ్ బలగాలు తెలంగాణ ఉద్యోగులను అనుమతించడం లేదు. జల వివాదం కొలిక్కి రాకపోవడంతో నాగార్జున సాగర్ డ్యాం నిర్వహణ పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలు ఎవరివనేది నేటికీ స్పష్టత లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ నీటి సంవత్సరం (జూన్ నుంచి మే వరకు) ప్రారంభం కావడానికి మరో ఐదు నెలల టైమే ఉండడంతో సాగర్ ప్రధాన డ్యాం నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉంది. ప్రధాన డ్యాంపై కుడికాల్వ గేట్లపైన, సూట్ గేట్లు, క్రస్ట్ గేట్లకు గ్రీసింగ్, రబ్బరు సీల్ల మరమ్మతులు, రూఫ్‌లకు సర్వీసింగ్ చేయడంవంటి పనులు చేయాల్సి ఉంది.తమ అధీనంలో ఉన్న 13వ గేటు వరకే ప్రాజెక్టు నిర్వహణ పనులు చేస్తున్నామని, డ్యాం మొత్తం అప్పగిస్తే తప్ప పూర్తి చేయలేమని తెలంగాణ అధికారులు చెబుతున్నారు. దీంతో జూన్‌లో ఎగువ నుంచి వరదలు వస్తే పరిస్థితేంటనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## గొర్రెల పంపిణీలో రూ.2.20 కోట్ల స్కాం!



తెలంగాణ బ్యూరో, జనవరి 22 (తీన్మార్ న్యూస్): బీఆరెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకున్నదని తెలుస్తోంది. ఈ మేరకు పశుసంవర్ధక శాఖలో జరిగిన అక్రమాలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. గొర్రెల పెంపకం దారులకు ప్రభుత్వం సబ్సిడీ ధరలపై యూనిట్‌లను అందజేసిన సంగతి తెలిసిందే. అయితే.. గొర్రెల పంపిణీదారుల పేరుతో అధికారులు నిధులు స్వాహా చేశారని ఏసీబీ గుర్తించింది. వాటిని నకిలీ ఎకౌంట్లలోకి మళ్లించినట్టు తేల్చారు. 133 యూనిట్లకు చెల్లించాల్సిన నిధులు పక్కదారి మళ్ళినట్లు గుర్తించారని తెలిసింది. దీనిపై విచారణకు దిగిన ఏసీబీ అధికారులు మాసబ్ ట్యాంక్ లోని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో సోదాలు చేయగా.. కీలక కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లు మాయమైనట్టు గుర్తించారని సమాచారం. కొన్ని కీలక ఫైళ్లు కూడా కనిపించడం లేదని చెబుతున్నారు. మొత్తంగా రూ.2.20 కోట్ల మేరకు కుంభకోణం జరిగిందని ఏసీబీ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. ఏసీబీకి కొత్త ప్రభుత్వంలో ఇదే తొలి కేసు. దీనిపై సైబరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. అయితే.. దానితో సమాంతరంగా ఏసీబీ అధికారులు కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే పలు కీలక ఆధారాలు ఏసీబీకి లభ్యమైనట్టు తెలుస్తోంది.

## పోర్టల్ లో లోపాలు, సవరణలపై చర్చించిన ధరణి కమిటీ



హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): ధరణి పోర్టల్ లోపాల కారణంగా బీఆర్ఎస్ హయాంలో చాలా మంది పేద రైతులకు రైతుబంధు సాయం అందలేదని కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి అన్నారు. సీసీఎల్ఏలో ధరణిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోర్టల్ లో లోపాలు, చేయాల్సిన సవరణలపై కమిటీ చర్చించింది. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ 2014 వరకు రైతులకు భూముల హక్కుల విషయంలో ఎలాంటి సమస్యలూ రాలేదన్నారు. గత ప్రభుత్వం చేసిన చట్టాల్లో అనేక లోపాలున్నాయని, వాటిని సవరించాల్సి ఉందని చెప్పారు. ధరణిలో ఉన్న లోపాల కారణంగా లక్షల మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కమిటీ ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటుందని చెప్పారు. సీనియర్ ఐఏఎస్ అధికారి రేమండ్ పీటర్ మాట్లాడుతూ ధరణితో లింక్ ఉన్న అని శాఖల ఒపీనియన్ తీసుకుంటామని, తాత్కాలికంగా, దీర్ఘకాలికంగా ఏం చేయాలనే అంశాలను పరిశీలిస్తామని చెప్పారు. మార్పులు, చేర్పులపైనే తమ కమిటీ నివేదిక అందిస్తుందని చెప్పారు. కొంత మంది కలెక్టర్లతో రెండు రోజుల్లో సమావేశం నిర్వహిస్తామని అన్నారు.

కమిటీ సభ్యుడు, న్యాయవాది సునీల్ మాట్లాడుతూ.. ధరణి పై హైకోర్టు లో చాలా కేసులు ఉన్నాయని, వాటిని పరిశీలిస్తామని చెప్పారు. తాత్కాలిక సవరణలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్పారు

## వ్యక్తిగత పనులు చేయించుకోవడానికే సలహాదారులను నియామకం

హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వ్యక్తిగత పనులు చేయించుకోవడానికి ప్రభుత్వ నిధులతో సలహాదారులను నియమించుకున్నారని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వానికి సలహాదారులు అవసరం లేదని విమర్శించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాత్రం సలహాదారులను ఎందుకు నియమించుకున్నారని ప్రశ్నించారు. తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీని 1,000 మీటర్ల లోతులో బొంద పెడతారని హెచ్చరించారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓడిపోయినవారికి, టికెట్లు దక్కనివారికి రాజకీయ పునరావాసం కల్పించడం కోసం, తన వ్యక్తిగత వ్యవహారాలు చూడటం కోసం సలహాదారులను నియమించుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సలహాదారుల నియామకాలపై రేవంత్‌రెడ్డి కోర్టులో కేసులు వేశారని గుర్తు చేశారు.

తాము మాత్రం ప్రజాకోర్టులోనే తేల్చుకుంటామని చెప్పారు. నాడు రాష్ట్ర అవసరాల కోసం, పాలనలో పని తీరు మెరుగుపర్చుకోవడం కోసం కేసీఆర్ విషయ నిపుణులైన జీఆర్ రెడ్డి, ఆర్ విద్యాసాగర్‌రావు లాంటివారిని, రిటైర్డ్ అధికారులను సలహాదారులుగా నియమించారని వివరించారు. కానీ రేవంత్‌రెడ్డి మాత్రం ఫక్తు రాజకీయ నాయకులను సలహాదారులుగా నియమించుకున్నారని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో సహకరించిన వేం నరేందర్‌రెడ్డిని సీఎం సలహాదారుడిగా నియమించుకున్నారని ఎద్దేవా చేశారు. నరేందర్‌రెడ్డికి పబ్లిక్ అఫైర్స్‌లో ఉన్న అనుభవం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధులతో సొంత అవసరాలను తీర్చుకోవడానికి సలహాదారులను నియమించుకున్నారని ఆరోపించారు. నాయకుల సంచులు మోసిన వారికి, ఫైల్స్ మోసిన వారికి పదవులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చెప్పిన మార్పు ఇదేనా? అని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల సలహాదారుగా షబ్బీర్ ఆలీని నియమించారని, మరి ఆ శాఖల మంత్రి ఏ బాధ్యతలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డికి 50 రోజుల సమయం ఢిల్లీ, విదేశీ పర్యటనలకే సరిపోయిందని, పాలనపై ఎప్పుడు దృష్టి పెడుతారని నిలదీశారు.

## ఎమ్మెల్సీలుగా మహేష్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్ ఏకగ్రీవం

హైదరాబాద్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌కు ఉపసంహరణ గడువు నేటితో (మంగళవారం) ముగిసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రెండు నామినేషన్‌లు మాత్రమే రావడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఎన్నికలు లేకుండానే కాంగ్రెస్ నుంచి నామినేషన్ దాఖలు చేసిన మహేష్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యాలయం ప్రకటించింది. కాసేపట్లో అసెంబ్లీ కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్ నుంచి ఎమ్మెల్సీ సర్టిఫికెట్లను మహేష్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్ అందుకోనున్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# అందరివాడు అయోధ్య రాముడు

అవును శ్రీరాముడు అందరి వాడు ఆయన అందరికీ బంధువు జగదేక వీరుడు ఆయనది జగమంత కుటుంబం. రాముడి ప్రేమకు ఎల్లలు లేవు. ఆయన చూపులకు పరిధులుండవు. సమస్త ప్రపంచం ఇప్పుడు రామనామం జపిస్తోంది ఆయన కోసం తపిస్తోంది. అయోధ్య నుండి దర్శనం ఇవ్వనున్న బాల చంద్రుడి దర్శనం కొరకు ఆసేతు హిమాచలం అమితానందంతో ఎదురు చూస్తోంది. 2024 జనవరి 22వ తేదీన అయోధ్యలో ఆవిష్కృతం కానున్న శ్రీరాముని ఆలయ ఆరంభ ఘట్టం ఓ అద్భుతం. భారతీయుడి కల సాకరమైన వేళ ఈ రోజు కోసం శతాబ్దాలుగా రామదండు ఎదురు చూసింది. ఈ క్రమంలో ఎన్నో పరిణామాలు రామ మందిరానికై జరిగిన రాజీలేని పోరాటంలో ఎందరో భక్తులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. రామ జన్మభూమికై దేశ వ్యాప్తంగా ఆయా దశల్లో పెద్ద ఎత్తున జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో లక్షల సంఖ్యలో భక్తులు పాల్గొని నేటి విజయానికి బాటలు వేశారు.

**చరిత్రలోకి వెళ్తే**

ఉత్తరప్రదేశ్‌లో అయోధ్య ఓ ముఖ్య పట్టణం. అయోధ్యను సాకేతపురం అని కూడా పిలుస్తారు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ జిల్లాలో వుంది. భారత దేశంలోని అతి పురాతన పట్టణాల్లో అయోధ్య ఒకటి. శ్రీరాముడిగా సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు అవతరించిన ప్రదేశం. రామాయణ మహాకావ్యం ఆవిష్కరణకు మూలం అయోధ్య. 1528లో మొఘల్‌లు ఈ ప్రాంతాన్ని ఆక్రమించారు. ఫలితంగా రాముడు పుట్టిన ప్రాంతం వారి ఆధీనంలోకి వెళ్ళింది. అయోధ్య నగరంలో వున్న రామ మందిరాన్ని భూస్థాపితం చేసి దాని స్థానే మసీద్‌ను అక్రమంగా నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. మొఘల్ జనరల్ మీర్ బాకీ మసీద్‌ను నిర్మించి మొఘల్ చక్రవర్తి బాబర్‌కు అంకితం ఇవ్వడంతో అదే బాబ్రీ మసీదుగా పిలువబడేది.

**సంఘ్ పరివార్ ఉద్యమం**

1980 దశకంలో విశ్వహిందూ పరిషత్ దాని అనుబంధ సంఘ్ పరివార్ సంస్థలు రామజన్మ భూమికై ఆందోళనకు తీవ్రతరం చేశాయి. మసీద్‌ను నేల మట్టం చేసి మందిరం నిర్మించి తీరాలన్నది వీరి సంకల్పం.

1990వ సంవత్సరంలో ఆందోళన పతాక స్థాయికి చేరింది. ఆ ఏడాది సెప్టెంబర్,- అక్టోబర్ నెలల్లో సాగిన రథయాత్ర ఉద్యమాన్ని దేశ నలుదిశలూ మార్మోగేలా చేసింది. బిజెపి అగ్రనేత లాల్ కృష్ణ అద్వానీ రథయాత్ర కు నాయకత్వం వహించారు. మహోగ్రంగా సాగిన రథయాత్రకు అద్వానీ సారథి కాగా, సంఘ్ పరివార్ వారధిగా నిలిచింది. ఈ యాత్ర భారత దేశ చరిత్రలో అత్యంత ప్రజాదరణ కలిగినదిగా గుర్తుండిపోయింది. గుజరాత్‌లోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం సోమనాథ్ నుండి ప్రారంభమై వివిధ రాష్ట్రాల మీదుగా సాగుతూ అయోధ్య చేరుకునేలా రూపొందించిన వ్యూహం అలనాడు కేంద్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించింది.

రోజుకు 300 కిలోమీటర్లు సగటున గుజరాత్‌లో రథయాత్ర సాగింది. ఆ రాష్ట్రంలో సుమారు 600 గ్రామాల మీదుగా యాత్ర సాగింది. 50 ర్యాలీలు నిర్వహించగా గుజరాత్ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. యాత్రలో అద్వానీ ప్రసంగాలు హిందూ జాతీయతా ఇతివృత్తాలను ప్రస్తావిస్తూ హైందవ సమాజాన్ని తట్టి లేపాయి. గుజరాత్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మతపరమైన అల్లర్లు మొదలయ్యాయి. పలు రాష్ట్రాల్లో పరిస్థితి అదుపు తప్పింది. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి.

అప్పటి విపి సింగ్ ప్రభుత్వానికి ఈ పరిణామం జీవన్మరణ సమస్యగా మారింది. అద్వానీ అరెస్ట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నాటి బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ అద్వానీని అరెస్ట్ చేయించారు. ముఖ్యంగా రాముడికీ, బాబర్‌కూ మధ్య జరుగుతున్న పోరాటంగా దీన్ని జనంలోకి తీసుకువెళ్లడంలో అద్వానీ ఘన విజయం సాధించారు మరీ ముఖ్యంగా నేడు భారతీయ జనతా పార్టీ అప్రహతిహతంగా వెలిగేందుకు ఆయన ప్రత్యక్ష కారకుడు.

**అద్వానీ అరెస్టు**

అయోధ్యలో కరసేవకు అద్వానీ చేరుకునే అవకాశం లేకుండా అక్టోబర్ 23న బీహార్‌లోని సమస్తిపూర్‌లో ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. అద్వానీని అరెస్ట్ చేసినప్పటికీ కరసేవకులు దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి రైళ్లలో టిక్కెట్లు కొనుక్కొని మరీ అయోధ్య తరలి వెళ్ళారు. సుమారు లక్షన్నర మంది కర సేవకులు ఆయా ప్రాంతాల్లో అరెస్టు అయ్యారు. అక్టోబర్ 30వ తేదీన దాదాపు 40 వేల మంది ప్రభుత్వ ఆంక్షలను అధిగమించి అయోధ్య చేరుకొని బాబ్రీ మసీదును చుట్టిముట్టారు. అక్కడ సుమారు 20 వేల మంది భద్రత దళాలున్నాయి. కరసేవకులను నిలువరించేందుకు చేసిన ప్రయత్నాలను అధిగమించి ఓ కార్యకర్త బాబ్రీ మసీదుపైకి ఎక్కి కాషాయం జెండా ఎగురవేశాడు. వెనువెంటనే వేల సంఖ్యలో కరసేవకులు గొడ్డళ్ళు, పలుగులు ఇతర ఆయుధాలతో మసీద్‌ను కూల్చే ప్రయత్నం చేశారు. దీంతో భద్రతా దళాలు తొలుత భాష్ప వాయువును ప్రయోగించి తర్వాత తుపాకులతో కాల్పులు జరిపాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ రణరంగంలో సుమారు 20 మంది కర సేవకులు జై శ్రీరామ్ జై శ్రీరామ్ అని నినదిస్తూ నేలకొరిగారు.

**ఆంధ్రప్రదేశ్‌లో**

రామ శిలా పూజల సమయంలో అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ లో అద్వానీ రథయాత్ర నేపథ్యంలో ఊరూరా రామ శిలా పూజలు నిర్వహించడం విశేషం.

దేశ వ్యాప్తంగా ప్రతి ఒక్క గ్రామం నుండి ఇటుకలను సేకరించి, వాటిన ఆయా గ్రామాల్లోని రామాలయాల్లో పూజించి, కరసేవలో భాగంగా అయోధ్యకు చేర్చి రామ మందిరం నిర్మాణానికి ఇవ్వాలనేది ఓ సంకల్పం. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ క్రతువు జరిగింది.

# ప్రక్షాళన దిశగా తెలంగాణ స్త్రీ నిధి సహకార సంస్థ...!

**– స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ రెడ్డిని తొలగించి ఐ.ఏ.ఎస్ అధికారిని నియమించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం**



హైదరాబాద్, జనవరి 22(తీన్మార్ ప్రతినిధి): తెలంగాణ స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్ ప్రభుత్వ రంగ సంస్థలో రిటైర్డ్ ఉద్యోగుల పెత్తనం, సి.ఎస్.ఆర్ నిధుల మళ్లింపు, ఇతర అభియోగాలు ఉన్న నేపథ్యంలో స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్ ను ప్రక్షాళన చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా రిటైర్మెంట్ అయి ఉన్నత పదవుల్లో తిరిగి కొనసాగుతూ వున్న వారిని తొలగించి, రూల్ ఆఫ్ రిజర్వేషన్ కింద మార్పులు చేసి స్త్రీ నిధి మహిళా బ్యాంకును దారిలో పెట్టాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. స్త్రీ నిధి సంస్థ లో ప్రస్తుతం రిటైర్డ్ యం.డి అయిన జి.విద్యాసాగర్ రెడ్డి 13 సంవత్సరాలుగా మేనేజింగ్ డైరెక్టర్గా కొనసాగుతుండగా మరికొంతమంది రిటైర్డ్ పర్సన్స్ డీజీఎం పోస్టులో కొనసాగుతున్నారు. సంస్థలో పనిచేస్తున్న మిగతా సిబ్బందికి ప్రమోషన్లు రాకపోగా డీజిఎం స్థాయిలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులు వారిని ఎన్నో ఇబ్బందుల గురి చేస్తున్నారని చాలా ఫిర్యాదులు వెళ్ళు వెత్తుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలకు బోర్డులకు, కార్పొరేషన్లకు రిటైర్మెంట్ అయి తిరిగి కొనసాగుతున్న అధికారుల లిస్టు సిద్ధం చేసిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలియజేశారు. రిటైర్డ్ అయ్యి కూడా తిరిగి 13 సంవత్సరాలుగా స్త్రీ నిధిలో తిష్ట వేసిన జి.విద్యాసాగర్ రెడ్డి యొక్క తొలగింపు అనివార్యం కావడంతో ఆ స్థానంలో ఐ.ఏ.ఎస్ అధికారిని కొనసాగించాలని ప్రభుత్వం యోచిస్తుంది.

# ఘనంగా శ్రీ అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట





పెబ్బేరు, జనవరి 22(తీన్మార్ న్యూస్): ఈరోజు శ్రీశ్రీ రామ జన్మభూమి అయోధ్యలో రాముని ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా వనపర్తి జిల్లా బిజెపి నాయకులు ముఖ్య అతిథులుగా నాగవరం తండా లోగో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టకు హాజరయ్యారు. రామ్ నగర్ కాలనీలో రామాలయం టెంపుల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాల్ నగర్ ఆంజనేయస్వామి టెంపుల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వనపర్తి గాంధీ చౌక్ శ్రీ శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో రాముని అక్షంతలు భారతీయ అంతా పార్టీ నాయకులు పెద్ద ఎత్తున మహిళలు స్వాగతం పలికి వారికి మంగళహారతులతో ప్రత్యేకంగా ఆహ్వానించారు. రామాలయం టెంపుల్లో ముఖ్య అతిథులుగా పాల్గొనడం రాముని యొక్క దర్శనం చేసుకుని భగవంతుడు రామజన్మ నుంచి అయోధ్యకు నుంచి వచ్చిన అక్షంతలను శ్రీశ్రీ రాములవారి టెంపుల్ లో గల అయ్యగారితో అక్షంతలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు బిజెపి నాయకులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులైన మున్నూరు రవీందర్, వనపర్తి జిల్లా అధ్యక్షులు డి నారాయణ మరియు ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి శ్రీశైలం, మరియు వనపర్తి టౌన్ పట్టణ బిజెపి అధ్యక్షులు బచ్చు రాము, నాగర్ కర్నూల్ జిల్లా పార్లమెంట్ ప్రవీణ్, వనపర్తి పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి సుగురు రాములు, వెంకటేష్ నాయుడు, బాలరాజు, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య రాముడు విగ్రహ ప్రతిష్టను అంగరంగ వైభవంగా ఉత్సవాలు





నేరేడుచర్ల, జనవరి 22(తీన్మార్ న్యూస్): అయోధ్య రాముడి ఆలయం కోసం 500 సంవత్సరాలగా ఎదురుచూస్తున్న హిందువుల కలలు సహకారమైన శుభవేళ నేరేడుచర్ల పట్టణంలో అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. నేరేడుచర్ల పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండ రామాలయంలో మరియు పాత రామాలయం, లో అయోధ్య రాముడి విగ్రహా ప్రాణ ప్రతిష్ట సందర్భంగా భగవద్ధ్వాజాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు స్థానిక యస్ ఐ పరమేష్ భగవత్ ధ్వజాన్ని ఆవిష్కరించారు. ఖమ్మం సుందరకాండ శ్రీనివాసరావు బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం ఏర్పాటు చేశారు. చక్కటి భక్తి పాటలతో సీతారామాంజనేయ పారాయణంతో భక్తులు పరవశించిపోయారు. జైశ్రీరామ్ నాదాలతో హోరెత్తించారు. ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటుచేసి అయోధ్య రాముడి ప్రత్యక్ష ప్రసారం చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ జీ శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట చేస్తున్న సందర్భాన్ని చూస్తూ హిందూ భక్తులు తరించిపోయారు. అనంతరం ప్రత్యేక హారతి తో ముగించారు. అనంతరం ఆలయం చేరుకున్న భక్తులకు నూతన మరియు, పాత రామాలయంలో అన్నప్రసాదం అందించారు.

ఈ కార్యక్రమంలో కొనతం సత్యనారాయణ రెడ్డి, చల్లా శ్రీలత రెడ్డి, పాల్వాయి రమేష్, స్వామి కృపాకర్, మెట్టు వేణుగోపాల్ రెడ్డి, భువనగిరి అంజయ్య రాచకొండ శ్రీనివాస్, రమేష్, గోళ్ళ సుధాకర్, రమణారెడ్డి ,జంగయ్య, శ్రీరామ్ రెడ్డి, తాటికొండ శ్రీనివాస్ రెడ్డి ,మా శెట్టి మోహన్, కొత్త లక్ష్మణ్, వీరవెల్లి, శ్రీలత విజయలక్ష్మి, వినాయక రావు, కొనతం కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, చిల్లేపల్లి శీను, గురుస్వామి సైదులు, నటరాజు, గోపాలకృష్ణ, పుల్లయ్య మచ్చ శీను, సురేష్ సతీష్ విశ్వహిందూ పరిషత్, సభ్యులు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చిత్రకళా తదితరులు పాల్గొన్నారు.

# కోదండరామ్ ను కలిసిన బర్రెలక్క

**– నిరుద్యోగ సమస్య పై వినతి పత్రం అందజేత**



హైదరాబాద్, జనవరి 22(తీన్మార్ న్యూస్): హైదరాబాద్ లో సోమవారం నాడు ప్రొపెసర్ కోదండ రామ్ ను కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బర్రెలక్క కలిశారు. తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ సమస్య పైన కోదండరామ్ కి వినతి పత్రం అందజేశారు. అలాగే ఇంతకుముందు టిఎస్పిఎస్సి వేసిన నోటిఫికేషన్ ఎగ్జామ్స్ త్వరలో నిర్వహించాలని కోరారు. ప్రతి నియోజకవర్గానికి ఒక కోచింగ్ సెంటర్ ఫ్రీగా పెట్టాలని అడిగినట్లు, దీనిపైన కోదండరా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. కోదండరాం సార్ బర్రెలక్క మధ్యలో సుదీర్ఘ చర్చ జరిగినట్లు, రాష్ట్రంలో పలు రకాల అంశాలపై, సమస్యలపై చర్చించినట్టు సమాచారం. ఈ సమస్యను ప్రభుత్వానికి తెలియజేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భైరి రమేష్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు నాగయ్య, తెలంగాణ జన సమితి రంగారెడ్డి జిల్లా కన్వీనర్ దార సత్యం, హైకోర్టు అడ్వకేట్ రామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత



రాజపేట, జనవరి 22(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం పారుపల్లి గ్రామంలో స్కూల్ అటెండర్ గా ఎనలేని సేవలందించిన భూపతి మీనమ్మ ఇటీవల అకాల మరణం చెందారు. ఆదివారం 2003-2004 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ.5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎండీ అక్బర్ పాషా,భూపతి రవీందర్, నరుండ్ల కర్ణాకర్, రావుల బాల కిసాన్, వంచ రాజు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి రేగు ఫౌండేషన్ వారి బియ్యం పంపిణీ



రాజాపేట, జనవరి 21(తీన్మార్ న్యూస్): రాజాపేట మండల కేంద్రంలో ఇటీవలే అనారోగ్యంతో మరణించిన చేనేత కార్మికుడు ఆడెపు సత్యం కుటుంబానికి ఆదివారం రేగు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రేగు అనిత సిద్ధులు సహకారంతో 50 కేజీల బియ్యాన్ని ఆర్థిక సహాయంగా ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, నాయకులు కాకల్ల ఉపేందర్, కనకయ్య, మల్లేశం, సకినాల ఉపేందర్, పొట్ట బత్తిని వెంకన్న, నరహరి, వెంకటేశం, ఉపేందర్, ఆడెపు జగన్, వెంకన్న, కూర ఉప్పలయ్య, కర్రె కనకయ్య, దోమల శ్రీశైలం, ఎర్రగోకుల మల్లయ్య, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కు ఎంపికైన కొలనుపాక విద్యార్థి ఉదయ్




ఆలేరు, జనవరి 22(తీన్మార్ న్యూస్): మండలంలోని కొలనుపాక జెడ్పిహెచ్ఎస్ విద్యార్థి జంగా ఉదయ్ ఇటీవలే ఆన్లైన్ పద్ధతిలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ లో సెన్సార్ పెస్టిసైడ్ స్ప్రేయర్ రాష్ట్రస్థాయి ప్రాజెక్టుకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రామచంద్రయ్య తెలిపారు. సోమవారం ఉదయ్ ని ఎస్ఎంసి చైర్మన్ రాజా బోయిన కొండల్, గైడ్ టీచర్ మాధవి లత మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# రామన్నపేట లో ఎమ్మెల్యే వేముల వీరేశం పర్యటన



**– కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ**
**– లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే**

రామన్నపేట, జనవరి 22(తీన్మార్ న్యూస్): రామన్నపేట మండలంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పర్యటించారు. మండలంలో వివిధ శుభకార్యాలకు హాజరైయ్యారు. అనంతరం మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో 37 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తప్పనిసరిగా అంబేద్కర్ ఫోటో ఏర్పాటు చేయాలి

**– కొడారి వెంకటేష్ చైర్మన్ కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి**



భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 22(తీన్మార్ న్యూస్): భారతదేశం, జనవరి 26న జాతీయ పండుగగా జరుపుకునే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తప్పనిసరిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటో ఏర్పాటు చేయాలని కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జిల్లా చైర్మన్ కొడారి వెంకటేష్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి కి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సుమారు రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు కష్టపడి భారత రాజ్యాంగం ను రచించి మనకు అందజేశారని , డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటో తప్పనిసరిగా అన్ని ప్రభుత్వ/ ప్రైవేటు సంస్థల్లో గణతంత్ర దినోత్సవం రోజున తప్పనిసరిగా ఏర్పాటు చేసేటట్లు ఆదేశాలు (సర్కులర్) జారీచేయాలని ఆయన కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పోతరాజు శేఖర్, బీరం రామదాసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేజన్ పనుల ఏజెన్సీ అవినీతి బట్టబయలు

**– రామన్నపేట ఏరియా ఆసుపత్రి లో విజిలెన్స్ తనిఖీలు**
**– ఆస్పత్రిలో శానిటేషన్ నిర్వహణపై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల తనిఖీ**
**– సిబ్బందికి సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని ఫిర్యాదు**
**– సిబ్బంది జీతాల్లో కోతకు పాల్పడుతున్న కాంట్రాక్టర్**
**– ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్న అధికారులు**
**– ఏమేర చర్యలు తీసుకుంటారో చూడాలి**



భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 22(తీన్మార్ న్యూస్): జిల్లాలోని రామన్నపేట ఏరియా ఆసుపత్రిలో సోమవారం శానిటేషన్ పనుల నిర్వహణ ఏజెన్సీ అవినీతి బట్టబయలు అయింది. వీటి నిర్వహణపై జిల్లా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీ నిర్వహించారు. సిబ్బంది జీతభత్యాలు ఈఎస్ఐ ఈపీఎఫ్ చెల్లింపులపై రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి రూ. 12,900/– రూపాయలు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ. 10000/– రూపాయల మాత్రమే చెల్లిస్తున్నారని సిబ్బంది అధికారులకు తెలిపారు. ఈఎస్ఐ ఈపీఎఫ్ పేరిట రూ. 2000/– చెల్లింపు చేయాల్సి ఉండగా రూ. 1567/– రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని తనిఖీల్లో వెలువడ్డాయి.

సదరు కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ సిబ్బందికి సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని ఈ తనిఖీల్లో తెలిపారు. ఈ తనిఖీలకు సంబంధించిన నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఈ నివేదికలు అందిన అనంతరం ఏమేర చర్యలు తీసుకుంటారో చూడాలి. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఇంద్ర, ఎస్ కె.గౌస్, నర్సింహారెడ్డి, ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

# అంతా రామమయం
# గ్రామాల్లో అయోధ్య పండుగ సందడి



పెబ్బేరు, జనవరి 22(తీన్మార్ న్యూస్): అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. పెబ్బేరు మండలంలోని మున్సిపాలిటీ పరిధిలో మరియు ఆయా గ్రామాల్లో అయోధ్య పండుగ సందడి నెలకొన్నది. అయోధ్య రామమందిర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, హిందూ ధర్మ పరిరక్షణ సమితి, వివిధ పార్టీల నాయకులు గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీత, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి వేషధారణతో చిన్నారులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దేవతా మూర్తుల వేషధారణలో చిన్నారులు ప్రదర్శన చేశారు. వేడుకలు ఆకట్టుకున్నాయి. ఆలయాల్లో దీపారాధనలు, భజనలు, కీర్తనలు చేశారు. పెద్ద ఎత్తున అన్నదానాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. పెబ్బేరు పట్టణంలో హిందూ వాహిని సభ్యులు శ్రీరాముడి శోభాయాత్ర కనుల పండుగగా నిర్వహించారు. వీధివీధినా జైశ్రీరాం అంటూ చిన్న, పెద్ద తరతమ్యం లేకుండా నినాదాలు చేశారు. అయోధ్య రామమందిరంలో రాముడు కొలువుతీరటం సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు. అయోధ్యలో జరగనున్న ప్రాణప్రతిష్ఠను భక్తులు వీక్షించేలా ఆలయ ఆవరణంలో యల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. దర్శనం కోసం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**ముస్తాబైన పల్లెలు..**

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ పూజా మహోత్సవాన్ని పురస్కరించుకొని పెబ్బేరు మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్లపై కాషాయం జెండాలతో ముస్తాబు అయ్యాయి. సోమవారం ఆయా గ్రామాల్లోని పలు దేవాయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాల పెద్దలు, ఆలయాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఇంటింటి జై శ్రీరామ్ అంటూ రాయడం, ప్రమిదాలను, జెండాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటి వద్ద సోమవారం జెండాలు కట్టడంతోపాటు, సాయంత్రం దీపాలను వెలిగించారు.



# తెలంగాణ కేసరి క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వేముల



రామన్నపేట, జనవరి 22(తీన్మార్ న్యూస్): రామన్నపేట మండల కేంద్రంలో తెలంగాణ కేసరి దినపత్రిక క్యాలెండర్ నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల వీరేశం అవిష్కరించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, ప్రజలను చైతన్యం చేసేది పత్రికలేనని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో పత్రికల పాత్ర కీలకమని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పత్రికలు పనిచేయాలని, ప్రజల సమస్యలు వెలికితీసి, పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పిటిసి పున్న లక్ష్మి జగన్మోహన్, వైస్ ఎంపిపి నాగటి ఉపేందర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గుత్త నర్సిరెడ్డి, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు తిమ్మాపురం మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు గంగుల వెంకటరాజి రెడ్డి, పూస బాలకిషన్, గోదాసు శిరీష, మదూరి జ్యోతిరామ చందర్ రావు, పూస బాలమణి బాలనర్సయ్య, ఎండి రేహాన్, వనం హర్షినిచంద్రశేఖర్, బత్తుల కృష్ణ, ఎండి జమీరుద్దీన్, ఎండి అక్రమ్, ఎర్ర శేఖర్, కోట సుధాకర్, కూనూరు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు

**– శోభా యాత్ర, అన్నదాన కార్యక్రమం**





రాజపేట, జనవరి 22(తీన్మార్ న్యూస్): అయోధ్యలో శ్రీరామ జన్మ మందిర్ లో శ్రీ బాల రాముడు(రామ్ లల్లా)విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఉదయం 5 గంటల నుండి నగర సంకీర్తనలు మొదలయ్యాయి. ఆలయాన్ని పూర్తిగా విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులివెందుల రామకృష్ణ శర్మ శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీరాముల వారి శోభాయాత్ర ను గ్రామ పెద్దలు, యువకులు మరియు రామాలయ భజన భక్త బృందం సహకారంతో అత్యంత శోభయామానంగా ప్రధాన వీధుల్లో విహరిస్తూ కొనసాగింది. ఈ శోభాయాత్రలో భక్తులు కాషాయ కండువాలు వేసుకొని శ్రీరామ నామ కీర్తనలతో రామనామ జపం స్మరిస్తూ జైశ్రీరామ్, జైశ్రీరామ్ అంటూ నినాదాలు హొరెత్తాయి. శోభాయాత్ర అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదే విధంగా గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని విజయవంతం చేశారు. భక్తులు సాయంత్రం ప్రతి ఇంటి ముందు ఐదు దీపాలను వెలిగించుకోవాలని అదే విధంగా దేవాలయంలో జరిగే భజన కార్యక్రమాల్లో గ్రామస్తులు అందరూ పాల్గొనాలని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



రేగొండ, జనవరి 22 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం కొడవటంచ గ్రామంలోని ఓ వేడుకల మందిరంలో సోమవారం రేగొండ ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు యిప్పకాయల నర్సయ్య అధ్యక్షతన ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యమని అన్నారు. గ్రామాలల్లో పెండింగ్ లో ఉన్న సమస్యలపై ప్రజలతో చర్చించి నా దృష్టికి తీసుకురావాలని అన్నారు. సమస్యల పరిష్కారం జరిగేలా, అభివృద్దే లక్ష్యంగా పనిచేయాలని ఎన్నికలు ఏవైనా సరే, గెలుపు దిశగా కార్యకర్తలు పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీసీసీ ప్రెసిడెంట్ అయిత ప్రకాష్ రెడ్డి, టిపిసిసి ప్రెసిడెంట్ చల్లురి మధు, జిల్లా నాయకులు ఎన్ ఎస్ ఆర్ సంపత్ రావు, అప్పం కిషన్, సీనియర్ నాయకులు గూటోజు కిష్టయ్య, సూరం వీరేందర్, ఎంపీపీ పున్నం లక్ష్మీ – రవి లతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, అన్ని గ్రామాల అధ్యక్షులు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కుక్కల, కోతుల బెడదను అరికట్టాలని వినతి

**మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ని గ్రీవెన్స్ సెల్ లో కోరిన డివైఎఫ్ఐ, సిఐటియు నాయకులు**



వరంగల్, జనవరి 22 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ వరంగల్ నగరంలో కుక్కలు కోతుల బెడదను అరికట్టాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సెల్ లో డివైఎఫ్ఐ, సిఐటియు నాయ కులు డి.తిరుపతి, సింగారపు బాబు, టి.ఉప్పలయ్య, కూస రాజేష్ లు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. నగరంలో కుక్కలను కోతుల బెడదను అరికట్టాలని ప్రజలు నిత్యం వాటి తో ప్రమాదబారిన పడుతున్నారని, చాలాచోట్ల ప్రజలపై వాటి దాడి పెరిగిన నామమాత్రమైన చర్యలు తీసుకొని చేతులు దులుపుకుం టున్నారని, సంఘటన జరిగినప్పుడే హడావిడి చేస్తున్నారు. కుక్కల కోతుల బెడద కోసం ప్రతి ఏటా లక్షల రూపాయలు నిధులు కేటాయి స్తున్న, అవి నీళ్ల పాలే అవుతున్నాయి. ఉదయం రాత్రి, ఒంటరిగా ప్రయాణం చేయాలంటే ప్రజలు ప్రాణాలు చేతుల పెట్టుకొని జీవిస్తు న్నారు. నగ రంలోని ప్రతిచోటా ఏదో ఒకరోజు కుక్కల కోతుల దాడులు జరుగు తూనే ఉన్నాయని, అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తు న్నారని, కుక్కలు కోతుల నివారణ కోసం శాశ్వత పరిష్కారం చూడాలని విజ్ఞప్తి చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

**– తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా ఇంఛార్జీ అచ్చునూరి కిషన్**



ములుగు, జనవరి 22 (తీన్మార్ న్యూస్): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 01. 2020లోపు డిగ్రీ, బిటెక్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ములుగు జిల్లా ఇంఛార్జీ అచ్చునూరి కిషన్ సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. అలాగే గతంలో ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రులు కూడా మళ్ళీ నమోదు చేసుకోవాలని, ఆన్లైన్ లో https://ceotelangana.nic.in లో కానీ, ఆఫ్ లైన్ లో పాస్ ఫోటో, డిగ్రీ సర్టిఫికెట్స్, ఓటరు కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ లు సమర్పించి పాత, కొత్త వారు విధిగా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని, ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మన గళాన్ని చట్టసభల్లో వినిపించే ప్రజా గొంతుక తీన్మార్ మల్లన్న ను ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మేజార్టీ'తో గెలిపించి మన సమస్యల పరిష్కారాన్ని ప్రజా ప్రభుత్వం ద్వారా నెరవేర్చుకుందాం అని కోరారు.

# గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శాసన సభ్యులు నాయినికి సన్మానం




కాజీపేట, జనవరి 22 (తీన్మార్ న్యూస్): గంగపుత్ర సంఘం కాజీపేట వారు వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డినీ శాసన సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మీ యొక్క సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కులరవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలి, మొహమ్మద్ అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ పెంపు హామీ ఎప్పుడు
# అమలయ్యేనో.. ఈ నెలా పాత పెన్షనే



హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి నెలన్నర గడుస్తున్నది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన గ్యారంటీల అమలును గాలికొదిలేసింది.

గృహజ్యోతి, పింఛన్ల పెంపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాల ఊసే ఎత్తడంలేదు. గ్యారంటీలను అమలుచేయడానికి దరఖాస్తులు తీసుకున్నప్పటికీ.. విధివిధానాలను ఇంకా ఖరారుచేయలేదు. అసలు ఆ పథకాలను ఎప్పుడు అమలుచేస్తారా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో ఆసరా పింఛన్ల ఎంపుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో పాత పద్ధతిలోనే విడుదల చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇందులో భాగంగా ఒకట్రెండు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ చేయనున్నారు. ప్రస్తుతం సాధారణ పెన్షన్ రూ.2,016, దివ్యాంగ పింఛను రూ.3,016 వస్తున్నది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సాధారణ పింఛనును రూ.4 వేలు, దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.6 వేలు చేస్తామని ప్రకటించారు. ఆ హామీ ఎప్పటి నుంచి నెరవేరుతుందనే స్పష్టత లేకపోవడంతో పాత తరహాలోనే పింఛన్లను విడుదల చేయనున్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 15,98,729 మంది వృద్ధులు, 15,60,707 మంది వితంతువులు, 5,03,613 మంది దివ్యాంగులు, బీడీ కార్మికులు 4,24,585 మంది, ఒంటరి మహిళలు 1,42,394, గీత కార్మికులు 65,307, చేనేత కార్మికులు 37,145, హెచ్ఐవీ బాధితులు 35,998.. ఇలా వివిధ వర్గాలవారు మొత్తం 43,96,667 మంది పింఛన్లు పొందుతున్నారు. వీరికోసం ప్రతినెలా రూ.వెయ్యి కోట్లు ఖర్చవుతోంది. ఇక, రైతుబంధు విషయంలో కూడా ప్రభుత్వం ఇదేవిధంగా వ్యవహరిస్తున్నది. ఎన్నికల నాటికే పంటసాయం పెట్టుబడి డబ్బు సమకూరినప్పటికీ.. ఇప్పటివరకు రైతులకు ఆ మెత్తాన్ని అందించలేదు.

## రాష్ట్రాన్ని పచ్చగా మార్చిన హరితహారం..
## పేరు మార్చేందుకు సిద్ధమవుతున్న రేవంత్‌రెడ్డి సర్కారు



హైదరాబాద్, జనవరి 22: రాష్ట్రాన్ని పచ్చగా మార్చిన 'హరితహారం' పథకం పేరును మార్చేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు సిద్ధమవుతున్నట్టు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎంతో ఖ్యాతి తెచ్చిపెట్టిన ఈ ప్రతిష్ఠాత్మక పథకాన్ని అదే పేరుతో కొనసాగిస్తే అధికార కాంగ్రెస్‌కు ఒరిగేది ఏమీ ఉండదని, అందుకే ఆ పథకం పేరును మార్చాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. దీంతో ఇకపై ఈ పథకాన్ని ఏ పేరుతో అమలు చేస్తారన్న దానిపై ప్రభుత్వ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. రాష్ట్ర అటవీ శాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై త్వరలో జరుగనున్న సమావేశంలో కొత్త పేరుపై స్పష్టత రావచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి. 2024-25 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో అటవీ శాఖకు రూ.445 కోట్లు కేటాయించడంతోపాటు వన్యప్రాణుల దాడుల్లో చనిపోయిన, గాయపడిన, పశువులను కోల్పోయినవారికి పరిహారం చెల్లించేందుకు రూ.2 కోట్లు సమకూర్చాలని ఆ శాఖ అధికారులు ప్రతిపాదించారు. గతేడాది వివిధ పనులకు రూ.145 కోట్లు ఖర్చు చేసిన రాష్ట్ర అటవీ శాఖ.. ప్లాంటేషన్ డ్రైవ్‌తోపాటు హరితహారం కార్యక్రమానికి మొకలను సరఫరా చేసేందుకు పలు ప్రాంతాల్లో నర్సరీలను పెంచుతున్నది. ఈ ఏడాది జూన్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్ల మొకలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

## 'ధరణి' సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక
## ఇస్తాం: రేమండ్ పీటర్




హైదరాబాద్: 'ధరణి'లో ఉన్న సమస్యలను అర్థం చేసుకుంటున్నామని.. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ధరణి కమిటీ సభ్యుడు రేమండ్ పీటర్ తెలిపారు. సోమవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'ధరణి' లొసుగులపై చర్చిస్తున్నామని.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన సమస్యలపై కొంతమంది కలెక్టర్లతో సమావేశం అవుతామన్నారు. మీ సేవలో ఉన్న సమస్యలు, అగ్రికల్చర్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కూడా సమావేశం అవుతామని చెప్పారు. ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడానికి చాలా సమయం పడుతుందని అన్నారు. నివేదిక వచ్చాక ప్రభుత్వం 'ధరణి'పై స్పందిస్తుందని రేమండ్ పీటర్ తెలిపారు.

'ధరణి' కమిటీ ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయదు.. మార్పులు, చేర్పులు, సలహాలు ఇస్తుందని ధరణి కమిటీ సభ్యులు సునీల్ తెలిపారు. ఇందులో ఉన్న ప్రాబ్లెమ్స్ అన్నింటిని జిల్లా పరిధిలో పరిష్కరిస్తామని చెప్పారు. ధరణి ఒక్కటే సమస్య కాదని... ఇతర డిపార్ట్‌మెంట్ అధికారులతో కూడా చర్చించాలని అన్నారు. ప్రతి రాష్ట్రంలో భూముల వివరాలను కంప్యూటర్లలో రికార్డుల్లోకి ఎక్కించారన్నారు. 'ధరణి' సమస్యలపై చాలామంది కోర్టుకి వెళ్లారన్నారు. రైతుకు భూమి ఉండి.. రికార్డులో భూమిని నమోదు చేయకపోతే వారు చాలా ఇబ్బంది పడుతున్నారని సునీల్ చెప్పారు.

మధ్యంతర కమిటీ నివేదిక ప్రభుత్వానికి ఇస్తుందని ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి అన్నారు. లక్షల మంది రైతులు భూమికి సంబంధించిన పాసు బుక్కులు లేకపోవడంతో వారికి లబ్ధి చేకూరడం లేదన్నారు.

చట్టాల్లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండు, మూడు అంచెలుగా 'ధరణి' కమిటీ నిర్ణయాలు తీసుకుంటుందని కోదండరెడ్డి అన్నారు.

## అంగన్వాడీ ఉద్యోగుల బదిలీల్లో అవకతవకలు లేకుండా చూడాలి

**– ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా చేపట్టాలి.**

**– జిల్లా ఆడిషనల్ కలెక్టర్ రాహుల్ కి ప్రజావాణిలో ఫిర్యాదు**

**– దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు జిల్లా కార్యదర్శి.**

మంచిర్యాల జనవరి22: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయు) ఆధ్వర్యంలో సోమవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అంగన్వాడీ ఉద్యోగుల బదిలీల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్ కి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సిఐటియు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాలో ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడి ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్ల దరఖాస్తుల ప్రక్రియను జిల్లా అధికారులు గత సం,, జులై నెలలో ప్రారంభం చేయడం జరిగింది. నేటికి నెలలు గడుస్తున్న అధికారులు మాత్రం బదిలీలా ప్రక్రియను ఇంకా పూర్తి చేయలేదు. అదే విదంగా కొంతమంది వ్యక్తులు బదిలీలా విషయంలో అధికారులను ప్రలోబాలకు గురిచేసి , వారికి అనుకూలమైనా వారికి సులభంగా బాధిలీలు చేసుకునే అవకాశలు ఉన్నాయి. అదే విదంగా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు, వారి అర్హతలను వారి కార్యాలయంలోని నోటిస్ బోర్డు పై చేర్చాలి. కావున ఎలాంటి అవకతవ కలు జరగకుండా అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేసే విదంగా జిల్లా కలెక్టర్, జిల్లా డిడబ్ల్యూఓ అధికారులు చర్యలు చేపట్టాలని సీఐటీయుగా కోరుతున్నాం.



## ఇక దారులన్నీ అయోధ్య వైపే.. ఏడాదికి 5 కోట్ల మంది యాత్రికులు!



ఇంటర్నెట్ డెస్క్: దేశ ప్రజల చిరకాల స్వప్నమైన రామమందిర నిర్మాణం ఎట్టకేలకు సాకారమైంది. గర్భగుడిలో బాల రాముడు కొలువుదీరిన క్షణాలను యావత్ దేశం వీక్షించింది.

జనవరి 23 నుంచి సామాన్య భక్తుల దర్శనానికి అనుమతి ఇవ్వనున్నారు. దీంతో బాలరాముడిని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రామభక్తులు అయోధ్యకు క్యూ కట్టనున్నారు. ఇలా నిత్యం 1 నుంచి 1.5లక్షల మంది భక్తులు ఈ చారిత్రక నగరాన్ని సందర్శించే అవకాశం ఉందని అంతర్జాతీయ బ్రోకేజ్ సంస్థ జెఫరీస్ గ్రూప్ అంచనా వేసింది. దీంతో దేశ పర్యాటక ముఖ చిత్రమే మారనుందని అభిప్రాయపడింది. దేశంలో నూతన పర్యాటక కేంద్రంగా అయోధ్య మారనుందని దేశ, అంతర్జాతీయ వాణిజ్య సంస్థలు భావిస్తున్నాయి. రామాలయ ప్రారంభోత్సవం తర్వాత ఏడాదికి 5 కోట్ల మంది యాత్రికులు సందర్శించే అవకాశం ఉందని జెఫరీస్ నివేదిక అంచనా వేసింది. నగరంలో కొత్తగా నిర్మించిన ఎయిర్‌పోర్టు, పునరుద్ధరించిన రైల్వేస్టేషన్, రోడ్డు రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతోపాటు కొత్త హోటళ్లు, ఇతర ఆర్థిక కార్యకలాపాలు భారీగా పెరగనున్నట్లు తెలిపింది. మౌలిక సదుపాయాల వృద్ధితో పర్యాటకం మరింత పుంజుకోనుందని పేర్కొంది. 'రూ.1800 కోట్లతో అయోధ్యలోని రామాలయాన్ని నిర్మిస్తున్నారు. ఇదే సమయంలో అక్కడి ఎయిర్‌పోర్టు, రైల్వే స్టేషన్, రోడ్డు రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తున్నారు. ఇలా మౌలిక సదుపాయాలు కల్పించడం భారీ సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించడానికి వీలు కలుగుతుంది. ఆలయ ప్రారంభోత్సవం తర్వాత యాత్రికుల పెరుగుదలతోపాటు ఆర్థికంగానూ అనేక రంగాలు లాభపడతాయి. ముఖ్యంగా హోటళ్లు, విమానయానం, ఆతిథ్యం, ప్రయాణ అనుబంధ, సిమెంటు రంగాలు ప్రయోజనం పొందనున్నాయి. దేశ పర్యాటక రంగానికి ఇదో నూతన మోడల్‌గా మారనుంది. ఈ చారిత్రక నగరం ఇకనుంచి అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా అవతరించనుంది' అని జెఫరీస్ వెల్లడించింది.

## అయోధ్యకు మన రాముడొచ్చేశాడు: ప్రధాని మోదీ



అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరి అయోధ్య లో బాలరాముడు కొలువుదీరాడు. సోమవారం మధ్యాహ్నం రామమందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది.

ఈ మహోత్సవం అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. 'జై సియా రామ్' అంటూ ప్రధాని తన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. మన రామ్‌లల్లా ఇక టెంట్‌లో ఉండాల్సిన అవసరం లేదని, దివ్యమందిరంలో కొలువుదీరారని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు.

**కొత్త కాలచక్రానికి ప్రతీక..**

"పవిత్రమైన అయోధ్యాపురికి శిరసు వంచి నమస్కరిస్తున్నా. ఈ రోజు రామ భక్తులంతా ఆనంద పరవశంలో ఉన్నారు. ఎన్నో బలిదానాలు, పోరాటాలు, త్యాగాల తర్వాత మన రాముడు మళ్లీ అయోధ్యకు వచ్చాడు. ఈ శుభ గడియల్లో ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఈ కార్యం ఆలస్యమైనందుకు క్షమించమని రాముడిని వేడుకుంటున్నా. జనవరి 22, 2024.. ఇది కేవలం తేదీ మాత్రమే కాదు. కొత్త కాలచక్రానికి ప్రతీక. ఈ సమయానికి పరిపూర్ణ దివ్యత్వం ఉంది. కొన్ని వందల ఏళ్ల తర్వాత కూడా ఈ తేదీని ప్రజలు గుర్తుంచుకుంటారు. ఈ క్షణం కోసం అయోధ్య ప్రజలు వందల ఏళ్లుగా నిరీక్షించారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా దశాబ్దాల పాటు న్యాయపోరాటం చేశాం. ఇన్నేళ్లకు మన స్వప్నం సాకారమైంది. శ్రీరాముడి ఆశీస్సులతో ఈ అద్భుత ఘట్టంలో పాల్గొనే అవకాశం దక్కింది. ఈ రోజు దేశమంతా దీపావళి జరుపుకుంటోంది. ఈ రాత్రికి ప్రతి ఇంటా రామజ్యోతి వెలగాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

**రాముడు వివాదం కాదు.. సమాధానం..**

రామాలయ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయని, కానీ, చివరకు న్యాయమే గెలిచిందని ప్రధాని ఈ సందర్భంగా తెలిపారు. ఇందుకు న్యాయవ్యవస్థకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. "ఈ శుభ గడియల కోసం 11 రోజుల దీక్ష వహించా. రాముడితో అనుబంధం ఉన్న క్షేత్రాలన్నీ సందర్శించా. ఏపీలోని లేపాక్షి ఆలయం, తమిళనాడులోని రామేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నా. సాగర్ నుంచి సరయూ వరకు రామనామం జపించా. ఈ క్షణం దేశ ప్రజల సహనం, పరిపక్వతకు నిదర్శనం. ఇది మన విజయానికే కాదు.. వినయానికి కూడా సూచిక. కొందరు వ్యక్తులు మన సమాజ ఆత్మను అర్థం చేసుకోలేకపోయారు. రామనామం ఈ దేశ ప్రజల కంకణంలో నిండి ఉంది. మన దేశ సంస్కృతి కట్టుబాట్లకు రాముడే మూలం. ఆయన ఆదర్శం, విలువలు, క్రమశిక్షణ మనకు శిరోధార్యం. ఇది విగ్రహ ప్రాణ ప్రతిష్ఠే కాదు.. మన విశ్వాసాలకు ప్రాణప్రతిష్ఠ. రాముడు వివాదం కాదు సమాధానం. రాముడు అగ్ని కాదు.. వెలుగు. రాముడే భారత్ ఆధారం. ఆయనే భారత్ విధానం. రాముడే నిత్యం.. ఆయనే నిరంతరం. రాముడే విశ్వం.. ఆయనే విశ్వాత్మ" అని మోదీ కొనియాడారు.

**త్రేతాయుగంలో ఉన్నట్లుగా ఉంది: ఆదిత్యనాథ్**

అంతకుముందు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రసంగించారు. "500 ఏళ్ల కల నెరవేరింది. అనుకున్న చోటే రామాలయం నిర్మించాం. ఎన్నో ఏళ్ల పోరాటాల తర్వాత ఈ అద్భుత ఘట్టం సాకారమైంది. ఈ ఆనందాన్ని నేను మాటల్లో వర్ణించలేను. ఈ క్షణం కోసం దేశమంతా ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసింది. ప్రాణప్రతిష్ఠతో దేశమంతా రామమయంగా మారింది. త్రేతాయుగంలో ఉన్నట్లుగా అనిపిస్తోంది. అయోధ్య ప్రపంచ సాంస్కృతిక రాజధానిగా వర్ధిల్లుతుంది. మోదీ దూరదృష్టి, అంకితభావంతోనే ఇదంతా సాధ్యమైంది. అయోధ్యకు పూర్వవైభవం తెచ్చేందుకు రూ. వందల కోట్లు కేటాయించారు. రాముడు మనకు ఓర్పు బోధించారు. ఈ ప్రాణప్రతిష్ఠ వేడుకను తిలకించిన ఈ తరం ఎంతో అదృష్టవంతులు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ రామరాజ్యాన్ని సాకారం చేస్తుంది. ఇందులో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు" అని సీఎం ఆనందం వ్యక్తం చేశారు.

## 'ఈ భూమ్మీద అత్యంత అదృష్టవంతుడిని నేనే':
## రామ్‌లల్లా విగ్రహ రూపకర్త యోగిరాజ్



అయోధ్య: ఈ భూమ్మీద తన కంటే అదృష్టవంతులు ఎవరూలేరని రామ్‌లల్లా విగ్రహ రూపకర్త అరుణ్ యోగిరాజ్ అమితానందం వ్యక్తం చేశారు. ఈ మైసూరు శిల్పి తయారుచేసిన విగ్రహాన్ని అయోధ్యలో ప్రాణప్రతిష్ఠకు ఎంపిక చేయగా.. అది ఈ రోజు ఆలయంలో కొలువుతీరింది. 'ఈ క్షణం ఈ భూమ్మీద అత్యంత అదృష్టవంతుడిని నేనే అనే భావన కలుగుతోంది. నా పూర్వీకులు, కుటుంబ సభ్యులు, రామ్‌లల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతో ఉంటాయి. ఒక్కోసారి ఇదంతా కలలా అనిపిస్తుంది' అని మీడియా ఎదుట ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ముగ్గురు శిల్పులు వేర్వేరు శిలలతో రాముడి శిల్పాలను చెక్కగా అందులో ఒక్క విగ్రహాన్ని గర్భగుడికోసం ఎంపిక చేశారు. అది యోగిరాజ్ చెక్కినది. మిగిలినవాటిని కూడా ఆలయంలోనే ఇతర ప్రాంతాల్లో ఉంచుతారు. రామ్‌లల్లా అని భక్తులు పిలుచుకునే ఈ చిన్నారి రాముడి విగ్రహాన్ని 51 అంగుళాల ఎత్తుతో(దాదాపు 4.25 అడుగులు) ఆకర్షణీయమైన కృష్ణశిలతో తీర్చిదిద్దారు. శ్రీరామనవమి రోజున సూర్యకిరణాలు రాముడిపై ప్రసరించే విధంగా ఈ విగ్రహం ఎత్తును నిర్ణయించారు. ఈ రోజు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ ప్రాణప్రతిష్ఠ క్రతువు పూర్తయింది.

## రాజపేట లో పూజాలకు నోచుకోనీ శ్రీ వీరాంజనేయ స్వామి



రాజపేట, జనవరి 22(తీన్మార్ న్యూస్): అయోధ్య రామ జన్మభూమి లో సోమవారం రోజున శ్రీ రామచంద్ర మూర్తి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా దేశంలోని అన్ని గ్రామాలలోని దేవాలయాలను వేద పండితులతో ధూప దీపా నైవేద్యాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. కాని రాజాపేట పట్టణ శివారులో సుమారు 500 సంవత్సరాల క్రితం విలసిల్లిన శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహానికి ఎలాంటి పూజలు నోచుకోకుండా పాడవుగా ఉన్నదని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఈ వీరాంజనేయ స్వామి విగ్రహానికి పూజలు నిర్వహించాలని భక్తులు కోరారు.

## కొలనుపాకలో అన్నదాన వితరణ చేసిన గొట్టం విజయేందర్ రెడ్డి



ఆలేరు, జనవరి 22(తీన్మార్ న్యూస్): అయోధ్యలోని శ్రీ రామాలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని సోమవారం మండలంలోని కొలనుపాక గ్రామంలోని శ్రీ వీరనారాయణ స్వామి ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. గొట్టం విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అభ్యర్థులు ఖర్చుల వివరాలు అందించాలి..!



సిరిసిల్ల :అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారు ఖర్చు చేసిన పూర్తి వివరాలను జనవరి 2లోగా అందించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలన ప్రత్యేక అధికారిణి స్వప్న పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలు ఎలా అందించాలనే దానిపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో చేసిన ఖర్చుల వివరాలను, బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్ జత చేసి, ఒరిజినల్‌తో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలు, రోజు వారి ఖర్చుల బుక్, క్యాష్ బుక్‌లను జనవరి 2లోగా అందించాలని సూచించారు. ఈ నెల 29న జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి, కలెక్టర్ అనురాగ్ జయంతి అభ్యర్థులతో సమావేశం నిర్వహించి అభ్యర్థుల ఖర్చుల వివరాలను పరిశీలిస్తారని చెప్పారు. ఎన్నికల నియమావళి ప్రకారం విధించిన ఖర్చులు, అభ్యర్థులు అందించిన ఖర్చుల వివరాలకు తేడా ఉంటే జిల్లా ఎన్నికల మానిటరింగ్ కమిటీని సంప్రదించి తేడా గురించి వారికి వివరించాలని పేర్కొన్నారు. 2న అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎన్నికల సంఘం సీఈవో కార్యాలయానికి పంపించనున్నట్లు వెల్లడించారు. వివరాలు అందించని అభ్యర్థులను ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 10ఏ ప్రకారం అనర్హులు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీంతో పాటు వచ్చే మూడు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత కోల్పోతారన్నారు. జిల్లా నోడల్ అధికారి రామకృష్ణ, అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు షేక్‌చాంద్, రాజేంద్రప్రసాద్, సుచేత, మహ్మద్ షఫీ, అంజయ్య, సవిత పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



కరీంనగర్ : ల్లా మహిళా, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేతులమీదుగా దివ్యాంగులకు ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వందలాది రూ.కోట్లు ఖర్చు చేస్తుందని వివరించారు. ప్రస్తుతం రూ.68.24 లక్షల విలువైన 731 ఉపకరణాలు అందజేస్తున్నామని, మిగిలిన వారు తమ పేర్లు నమోదు చేసుకుంటే త్వరలో ఉపకరణాలు అందజేస్తామన్నారు. శిబిరానికి వచ్చిన దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా జిల్లా సంక్షేమ అధికారిణి సరస్వతి ఏర్పాట్లు చేయడంతో పాటు దగ్గరుండి పర్యవేక్షించారు. కొందరు పేర్లు నమోదు చేసుకున్నా ఉపకరణాలు రాలేదని, మరికొందరు తాము బ్యాటరీ ట్రైసైకిల్ అడిగితే మ్యానువల్ ట్రైసైకిల్ వచ్చిందని అధికారుల వద్ద వాపోయారు. పంపిణీ కార్యక్రమంలో అలీంకో ప్రతినిధి రవిశంకర్, బల్దియా కమిషనర్ శ్రీనివాస్, దివ్యాంగుల సంఘం ప్రతినిధులు అంజనారెడ్డి, స్వామి, సంపత్, శ్రీనివాస్, లక్ష్మణ్, రాజిరెడ్డి పాల్గొన్నారు. మరోవైపు ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి వచ్చి ఉపకరణాలు పొందిన దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేశారు. నాకు ఇద్దరు బిడ్డలు. 2016లో జరిగిన రోడ్డు ప్రమాదంతో రెండు కాళ్లు పనిచేయకుండా పోయాయి. అప్పటి నుంచి తండ్రి, భార్య దగ్గరుండి నాకు సపర్యలు చేస్తున్నారు. ఇప్పుడు శిబిరంలో బ్యాటరీ ట్రైసైకిల్ అందించారు. చిన్నచిన్న పనులకు మరొకరి మీద ఆధారపడకుండా వెళ్లి రావచ్చు. చాలా ఆనందంగా ఉంది. కుటుంబ సభ్యులకు భారం కాకూడదని మొబైల్ దుకాణంలో పనిచేస్తున్నాను. ఇంతకాలం మ్యానువల్ ట్రై సైకిల్ ఉండేది. రోడ్డు ఎత్తుగా ఉన్నప్పుడు చేతితో తొక్కితే కదలక, ఇబ్బంది పడేవాడిని. బ్యాటరీ ట్రై సైకిల్‌కు దరఖాస్తు చేసుకుంటే మంజూరైంది. ఇకనుంచి గతంలో ఉన్న సమస్యలు ఉండవు. నా భర్త కూలీ పనికి వెళ్తాడు. నాకు ఒక కొడుకు. చచ్చుబడిపోయిన కాలుతో ఏదైనా పనిమీద బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు మూడు చక్రాల సైకిల్ ఇవ్వడంతో ఆ ఇబ్బందులు తప్పుతాయి. కనీస అవసరాల కోసం నాకు నేనుగా సొంతంగా వెళ్లిరావొచ్చు.


# రైతువేదికల నిర్వహణకు నిధుల కొరత

పెద్దపల్లి : అటు నిర్వహణకు నిధుల కొరత.. ఇటు పర్యవేక్షణ లేకపోవడం.. వెరసి రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి.. పంటల సాగులో అన్నదాతకు అండగా నిలవాలన్న ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.. పంటల సాగులో ఆధునిక సాంకేతికతను రైతుల దరి చేర్చేందుకు, మార్కెటింగ్ తదితర అంశాలపై సదస్సులు నిర్వహించేందుకు 2020లో నాటి భారాస ప్రభుత్వం రైతు వేదికలు నిర్మించింది. క్లస్టరుకు ఒక్కోటి చొప్పున నిర్మించిన వేదికకు గరిష్ఠంగా రూ.22 లక్షల వరకు వెచ్చించారు. ఉమ్మడి జిల్లాలో 258 రైతు వేదికల నిర్మాణానికి రూ.56.6 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 258 రైతు వేదికలకు ఒక్కో దానికి ప్రతి నెలా రూ.10 వేల వరకు నిర్వహణ ఖర్చులవుతున్నాయి. 2022 జనవరి నుంచి నెలకు రూ.10 వేల చొప్పున చెల్లించారు. ఈ ఏడాది మార్చి నుంచి నిధులు నిలిచిపోవడంతో కొన్ని చోట్ల వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవోలు) సైతం నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.25.8 కోట్ల మేర నిర్వహణ నిధులు రావాల్సి ఉంది. మండలకేంద్రాల్లో ఉన్న రైతు వేదికలు కొంతమేర సద్వినియోగమవుతున్నాయి. ప్రభుత్వ శాఖలకు చెందిన సమావేశాలు, ఇతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక క్లస్టర్ల పరిధిలో ఉండే రైతు వేదికల తలుపులు ఏఈవోలు గ్రామానికి




వస్తే మినహా తెరచుకోవడం లేదు.రాష్ట్రంలో గత భారాస ప్రభుత్వ హయాంలో రైతు సమన్వయ సమితులు ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో రైతులను చైతన్యపరిచేందుకు ప్రతి పంచాయతీకి సమితి ఏర్పాటుతో పాటు మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేశారు. వీటికి అధ్యక్షుడితో పాటు 15 మందితో కూడిన కార్యవర్గాన్ని నియమించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుబంధు సమితులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో రైతువేదికల నిర్వహణపై సందేహాలు తలెత్తుతున్నాయి. వీటిని రైతుల అవసరాలకు వినియోగిస్తారా? ఇతర ప్రభుత్వ అవసరాలకు వాడతారా? అనేదానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు.

# అర్ధరాత్రి ఇంధన కష్టాలు



జగిత్యాల :జిల్లాలో మొత్తం 106 పెట్రోల్ బంకులు ఉన్నా అర్ధరాత్రి వేళల్లో కనీసం ఒక్కటి కూడా అందుబాటులో ఉండటం లేదు. ఏళ్ల నుంచి ఇదే కొనసాగుతున్నా, పట్టించుకునేవారు కరవయ్యారు. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 24 గంటలు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ రాత్రి 11 దాటిన తరువాత మూసివేస్తున్నారు. అత్యవసరమైన సందర్భాల్లోనూ ఇంధనం లభించడం లేదని వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణాలు, మండలాలతో పాటు, జిల్లా కేంద్రంలోనూ ఇదే దుస్థితి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సైతం ఇంధన కష్టాలు తప్పడం లేదు. రాత్రి పూట 10 గంటల తరువాత భద్రత కారణాలతో బంకులు మూసి ఉంచుతున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారని వాహనదారులు చెబుతున్నారు. క్యూఆర్ కోడ్, యాప్‌ల ద్వారా క్యాష్‌లెస్ సేవలు అందించే అవకాశం ఉన్నప్పటికీ, ఇంధనం పోసేందుకు నిరాకరించడం వినియోగదారులకు సేవా లోపమేనని ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రం, పట్టణాలు, మండలాల వారీగా, రాత్రి వేళల్లో కనీసం ఒక్క బంకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాల టైర్లకు గాలి నింపే సౌకర్యం తదితరాలను కచ్చితంగా అందుబాటులో ఉంచాలి. నగదు అవసరం లేకుండా క్యూఆర్ కోడు ఆధారంగా క్యాష్‌లెస్ విషయంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. అంతర్జాలం సక్రమంగా పనిచేయకపోవడం, తమ ఖాతా నుంచి నగదు బదిలీ అయినప్పటికీ, పెట్రోల్‌బంకు ఖాతాలోకి చేరలేదనే ఘటనలతో తరచూ ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనదారులకు ఇబ్బందులు ఎదురవకుండా బంకుల నిర్వాహకులు సేవలు అందించాల్సిందే. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు. ప్రభుత్వ నిబంధనలు అమలు చేసే విధంగా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. పెట్రోల్ బంకుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి వాహనదారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

## వృథాగా మిషన్ భగీరథ నీరు

కోరుట్ల,:కోట్ల రూపాయలు వెచ్చించి ఇంటిటికీ శుద్ధజలం(మంచినీరు) అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం లక్ష్యం నెరవేరడం లేదు. కోరుట్ల పట్టణంలో సుమారు లక్ష మంది ప్రజలు నివసిస్తున్నారు. ప్రజలకు మంచినీరు అందించేందుకు రెండేళ్ల కిందట అర్బన్ మిషన్ భగీరథ పథకంలో పట్టణంలోని అన్ని కాలనీల్లో నూతనంగా ప్రధాన పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. అంతర్గత పైప్‌లైన్ల ద్వారా ఇంటింటికీ ప్రత్యేక పైపులను అమర్చి కుళాయిలను బిగించి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ గుత్తేదారు గుత్తేదారు ఇంటింటికీ పైప్‌లైన్ ఏర్పాటు చేసి బిగించిన కుళాయిని తొలగించడంతో నీరు వృథాగా పోతోంది. పైపులను చాలాచోట్ల మురుగు కాలువలో, రోడ్లపై పడేస్తున్నారు. చాలాచోట్ల పైప్‌లైన్లకు పగుళ్లు వచ్చి లీకేజీలు ఏర్పడ్డాయి. పైపులను మురుగు కాలువలో వదిలేయడంతో మంచినీరు కలుషితమవుతోంది. పైపులకు అమర్చిన కుళాయిలను తొలగించడంతో రహదారులపై నిత్యం గంటల తరబడి నీరు ప్రవహించి బురదమయంగా మారడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తారురోడ్లపై నీరు ప్రవహించడంతో దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ఇళ్ల ముందున్న పైపులకు కుళాయిలను అమర్చి భగీరథ నీరు వృథాగా పోకుండా అరికట్టాల్సిన బల్దియా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

# అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట పడేనా!

కోరుట్ల :నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా, అక్రమంగా వెలుస్తున్న లేఅవుట్లపై అధికారుల నిఘా కరవైంది. అన్ని ధ్రువపత్రాలు ఉండి ఇంటి అనుమతి కోసం అధికారుల చుట్టూ తిరిగినా అనుమతి ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తారు. పంచాయతీ పరిధిలో వెలుస్తున్న అనుమతి లేని లేఅవుట్లలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి అనుమతులు ఇవ్వడం అలసత్వనికి నిదర్శంగా నిలుస్తోంది. ఎలాంటి అనుమతులు లేని లేఅవుట్ స్థలంలో ఓ పంచాయతీ కార్యదర్శి ఏకంగా 50 ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం గమనార్హం. దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ మండల అధికారి కార్యదర్శికి మెమో జారీ చేయడం ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పరిశీలనపై నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎకరం స్థలంలో లేఅవుట్ ఏర్పాటు చేయాలంటే 40 అడుగుల రహదారి, 30 అడుగుల అంతర్గత రహదారి 10 శాతం పంచాయతీ పేరిట రిజర్వ్ స్థలం కేటాయించాల్సి ఉంటుంది. లేఅవుట్ రుసుం, మార్పిడి, కాలువలు, వీధి దీపాలు, అంతర్గత పైపులైన్లు, రహదారుల అభివృద్ధితో పాటు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అన్ని ఉంటేనే ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. లేఅవుట్లకు డీటీసీపీ అనుమతి ఉండి, అభివృద్ధి పనులు జరిగి బ్లూప్రింటు ఉంటే ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ కోరుట్ల మండలం కల్లూర్ గ్రామ శివారులోని లేఅవుట్లలో డీటీసీపీ అనుమతి లేకుండా ఏకంగా 50 ఇంటి నిర్మాణాలకు పంచాయతీ కార్యదర్శి



అనుమతులు ఇచ్చారు. దీనిపై మండల అధికారి కార్యదర్శిని నిలదీశారు. దీనిపై పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో మెమో జారీ చేశారు. కల్లూర్ గ్రామపంచాయతీ పరిధిలో డీటీసీపీ అనుమతులు లేకుండా లేఅవుట్ చేసి ఇళ్లు నిర్మిస్తున్నా ఉన్నతాధికారుల దృష్టికి తేకుండా, ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంపై పంచాయతీ కార్యదర్శి వివరణ కోరుతూ మెమో జారీ చేశాం. కార్యదర్శి వివరణ ఇవ్వకపోతే తగు చర్యలు తీసుకుంటాం. డీటీసీపీ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టడం మా దృష్టికి రాలేదు. కార్యదర్శి, ఎంపీవో సమక్షంలో పరిశీలన చేసి డీటీసీపీ అనుమతులు లేకుండా ఉంటే తగు చర్యలు తీసుకుంటాం. అనుమతులు ఉన్న వాటినే కొనుగోలు చేయాలి.

# సర్దుబాటు సరే.. జీతాలేవీ..?



కొత్తగూడెం: 'భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా మిగిలిన వీఆర్ఏ ఉద్యోగాలను శాశ్వతంగా రద్దు చేస్తున్నాం.గ్రామ రెవెన్యూ అవసరాల కోసం నియమితులైన గ్రామ సహాయకులు వీఆర్ఏలుగా రూపాంతరం చెందారు. అలా తరతరాలుగా సామాజిక సేవ చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే' అంటూ భారాస సర్కారు వీఆర్ఏ వ్యవస్థను ఈ ఏడాది ఆగస్టు 10న రద్దు చేసింది. వారి విద్యార్హతల ఆధారంగా ఉత్తర్వులు 81, 85 ద్వారా ఇతర ప్రభుత్వ శాఖల్లో అటెండర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ హోదాల్లో నియమించింది. ఇంతవరకు బాగున్నప్పటికీ నూతన ఉద్యోగాల్లో చేరింది మొదలు ఇప్పటివరకు వేతనాలు అందించకపోవడంతో వారంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసరాలు తీర్చుకోవటానికీ అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని వాపోతున్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న వారిని వివిధ శాఖల్లో విలీనం చేసిన ప్రభుత్వం ఆ తర్వాత వారికివ్వాల్సిన ఉద్యోగ గుర్తింపు సంఖ్య (ఐడీ), పీఆర్ఏఎన్ (పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్) కేటాయించకపోవడంతో జీతాలు అందటం లేదు. సమస్య పరిష్కారానికి కలెక్టర్లకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని వారంతా వాపోతున్నారు. గతంలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా వేతనాలు చెల్లించే ప్రయత్నం జరగలేదని చెబుతున్నారు. ఆతర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో అటు మాతృశాఖ రెవెన్యూ, ఇటు కొత్త శాఖ నుంచి వేతనాలందక కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 354 (ఈ జిల్లాకు చెందిన వీఆర్ఏలు-228, సంగారెడ్డి, మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి వివిధ శాఖల్లో విలీనమైనవారు-126) మంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో వీరి సంఖ్య సుమారు 650 మంది ఉంటుంది. ఐదు నెలలుగా వేతనాలు అందకపోవటంతో వీరిలో చాలామంది సెలవు దినాల్లో కూలీ పనులకు వెళ్తున్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ వేతనాల సమస్యను తీరుస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే విషయంపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ కోసం సుమారు 80 రోజుల పాటు సాగిన నిరవధిక సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారి వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని గత సర్కారు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదని, ఈ సమస్యనూ కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశిస్తున్నారు.

# 'మహాలక్ష్మి' పథకం దుర్వినియోగంపై నిఘా

ఖమ్మం:ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలు కావడంతో టికెట్ల జారీలో లోపాలను అరికట్టేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బస్సుల రవాణా ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు చేస్తూ పారదర్శక సేవలను అందించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పథకం అమల్లోకి వచ్చాక ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు బస్సు ఎక్కే ప్రాంతం నుంచి గమ్యానికి చేరుకునే స్టాప్ వరకు కండక్టర్లు మహాలక్ష్మి జీరో టికెట్లు జారీ చేయాలి. ఎక్కువ మంది ప్రయాణికులను తరలిస్తే డ్రైవర్, కండక్టర్లకు సంస్థ నజరానాలు ప్రకటించింది. ఈ క్రమంలో ఎక్కువ టికెట్లు విక్రయిస్తున్నట్లు చూపించేందుకు కండక్టర్లు కొందరు పురుషులకు కూడా జీరో టికెట్లు ఇస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. మరోవైపు మహిళలకు అడిగిన స్టాప్ వరకు కాకుండా ఆపై స్టాప్‌ల టికెట్లు ఇస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆర్టీసీ తనిఖీ బృందాలు రంగంలోకి దిగాయి. తెలంగాణ గుర్తింపు కార్డు.. ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేసే వరకు తెలంగాణ ఆధార్ కార్డు, ఓటరు ఐడీల్లో ఒకటి ప్రయాణికులు వెంట తెచ్చుకోవడం తప్పనిసరని నిర్దేశించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్డులను అనుమతించడంలేదని స్పష్టం చేసింది. ఉచిత ప్రయాణం కావడంతో మహిళలు బృందాలుగా బయలుదేరి సాయంత్రానికి ఇంటికి చేరుకునేలా దగ్గర ప్రాంతాల్లో ఉ



న్న పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలకు సరదాగా వెళ్లి వస్తున్నారు. దీంతో బస్సుల్లో 70 శాతం మహిళలే ఉంటున్నారు. ఒక్కో వాహనంలో సీట్ల సామర్థ్యానికి మించి వంద మంది వరకు ప్రయాణికులు ఎక్కుతున్నారు. ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో 371 పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. వాటిలో గతంలో రోజుకు 90 వేల మంది ప్రయా ణించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 1.20 లక్షలకు చేరింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సులు అన్నీ ప్రయాణికులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి.

## సీఎంఆర్ బకాయిల వసూలుకు
# రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం



హుజూర్‌నగర్ :ధాన్యంగానీ, బియ్యంగానీ లేదా నగదు ఇచ్చేందుకు వారికి అవకాశం కల్పిస్తాం. బకాయిదారుల నుంచి బకాయిల వసూలు విషయంలో ఇక ఉపేక్షించేది లేదు'.. అని ఇటీవల పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బకాయిదారులే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణకు సిద్ధం అవుతోంది. ఇప్పటి వరకు సీఎంఆర్ ధాన్యం తీసుకొని సకాలంలో పెట్టకుండా ధాన్యాన్ని తమ వ్యాపారాభివృద్ధికి ఉపయోగించుకుని అధికారులను ముప్పతిప్పలు పెడుతున్న మిల్లర్లు ఇక బియ్యం లెవీ చెల్లించాల్సిందేనని ప్రభుత్వం అంటోంది. పౌరసరఫరాలశాఖ నష్టాలు, అప్పుల్లో ఉందని గుర్తించిన ప్రభుత్వం ఏ మేరకు సాధ్యమైతే అంతవరకు పూడ్చుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా బకాయిల జాబితాను సిద్ధం చేసింది. వీటిని వెంటనే వసూలు చేయడం వల్ల కార్పొరేషన్ మనుగడకు ఇబ్బంది ఉండదని అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. దీంతో జిల్లాల వారీగా బకాయిలు ఉన్న మిల్లర్ల జాబితా సిద్ధం చేస్తున్నారు. సీఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లర్లు ధాన్యం, బియ్యం, నగదు మూడింటిలో ఏది ఇచ్చినా తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇంకా మొరాయిస్తే ప్రభుత్వం కఠిన చర్యలకు దిగుతుందని హెచ్చరిస్తున్నారు. గతంలో ప్రభుత్వం అనేక వాయిదాలు ఇచ్చినా మిల్లర్లు తిరిగి ఇవ్వకపోవడంతో వారిపై చర్యలకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి దాదాపు 7,01,374 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా.. ఇప్పటి వరకు 6,00,147 మెట్రిక్ టన్నులు వసూలైంది. ఇంకా 1,01,227 మెట్రిక్ టన్నుల బియ్యం లెవీ పెట్టాల్సి ఉంది. యాసంగి కూడా అయిపోయింది కానీ వానాకాలం సీజన్ బియ్యం లక్ష్యం మాత్రం పూర్తి కాలేదు. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా సూర్యాపేట జిల్లా పెట్టాల్సి ఉండగా ద్వితీయస్థానంలో యాదాద్రి భువనగిరి, నల్గొండ మూడో స్థానంలో ఉన్నాయి. ఇక యాసంగి విషయానికి వస్తే ఈనెల 18నాటికి వచ్చిన లెక్కల ప్రకారం నల్గొండ జిల్లా నుంచి 23 శాతం సీఎంఆర్ బియ్యం వసూలు కాగా, సూర్యాపేట జిల్లా 5 శాతం మాత్రమే ఇచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా 26 శాతం సీఎంఆర్ బియ్యం పెట్టింది. మళ్లీ తాజాగా వానాకాలం ధాన్యం కేటాయింపులు జరుగుతున్నాయి.

## పోరాటాన్ని ఉద్ధృతం చేసిన
# అంగన్వాడీలు.. ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి..

అమరావతి : ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆంధ్రప్రదేశ్‌లో అంగన్వాడీలు పోరాటాన్ని ఉద్ధృతం చేశారు. ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమంతో ఆందోళనలను హెూరెత్తించారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ఇతర అంగన్వాడీ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే వరకూ సమ్మెను విరమించబోమని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గిరిధర్‌రావు కార్యాలయం ఎదుట బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ ప్రభుత్వం చర్చల పేరుతో అంగన్వాడీల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఆర్థికేతర సమస్యలను పరిష్కరించామని.. సమ్మె విరమంచాలని మంత్రులు చెప్పడం సరికాదన్నారు. ఆర్థిక పరమైన విషయాలను పరిష్కరిస్తేనే తాము సమ్మె విరమిస్తామని.. అప్పటి వరకూ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్థానికంగా ఎమ్మెల్యే అందుబాటులో లేరని కార్యాలయ సిబ్బంది తెలిపినా.. ఆయన వచ్చేంత వరకూ వేచి ఉంటామని అంగన్వాడీలు అక్కడే బైఠాయించారు. ఈ నిరసనల్లో సీఐయూటీ



నగర కార్యదర్శి శ్రీనివాసరావు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఇంటిని అంగన్వాడీ కార్యకర్తలు ముట్టడించారు. ఎమ్మెల్యే ఇంటి ముందు బైఠాయించి నినాదాలు చేశారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఇంటి ముట్టడికి యత్నించిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, అంగన్వాడీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

# కష్టాల చదువులు ఇంకెన్నాళ్లు?




తాడిపత్రి, తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కనీస వసతులు కరవయ్యాయి. తీవ్ర అసౌకర్యాల నడుమ విద్యార్థులు చదువును కొనసాగించాల్సిన దుస్థితి. 2009లో తాడిపత్రికి ప్రభుత్వ ఐటీఐ కళాశాల మంజూరైంది. అప్పటి నుంచి స్థానిక మార్కెట్‌యార్డులోని రేకులషెడ్లలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ సివిల్, డీజిల్ మెకానిక్, కంప్యూటర్, ఎలక్ట్రికల్ వంటి బ్రాంచులు ఉన్నాయి. మొత్తం 160 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కర్నూలు, కడప జిల్లాల సరిహద్దులో తాడిపత్రి ఉండటంతో అక్కడి విద్యార్థులు సైతం కళాశాలలో చేరి చదువుకుంటున్నారు. కళాశాలకు సొంత భవనాలు లేవు. ఆ దిశగా పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. రేకులషెడ్లలో తరగతులు నిర్వహిస్తుండటంతో వర్షాకాలంలో నీరు లోపలికి చేరుతున్నాయి. వేసవిలో ఎండ వేడిమికి గదుల్లో కూర్చోలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా విభాగాలకు పరికరాలు ఉన్నాయి. వాటికి విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కంప్యూటర్లు సైతం పని చేయడం లేదు. గదుల పక్కనే పండ్లు, పలు రకాల కూరగాయల దుకాణాలు ఉండటంతో దుమ్ము ధూళి వస్తుంది. ఫిట్టర్ విభాగానికి చెందిన విద్యార్థులను శిథిల గదిలో కూర్చోబెడుతుండటంతో అది ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాగునీరు, గాలి, వెలుతురు సరిగా లేవు. తరగతి గదుల సమీపంలో పండ్లు, ధాన్యం వ్యర్థాలు పడేస్తుండటంతో అవి కుళ్లి దుర్వాసన వస్తున్నాయి. దానికితోడు దోమల విపరీతంగా ఉన్నాయి. ఇక్కడ వసతులు లేకపోవడంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదు.

# దెబ్బతిన్న పంటల వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం

యద్దపాడు : తుపాను ప్రభావంతో నీట మునిగి పంటలు దెబ్బతిని నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవటానికి చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి మురళీ తెలిపారు. వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన యద్దపాడు మండలంలో పర్యటించారు. తుపాను ప్రభావంతో నక్కవాగు పొంగి వరద నీటిలో మునిగిన జాలాదిలోని పంటచేలను పరిశీలించారు. వరద నీటిలో నానుతున్న శనగ, పొగాకు, మొక్కజొన్న, జూట్ పంటలకు వాటిల్లిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో చూశారు. బాధిత రైతులతో మాట్లాడారు. పంటచేలలో నీటిని ముందుగా బయటకు పంపే ఏర్పాటు చేయాలన్నారు. పొలాలు ఆరాక చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. నక్కవాగు వరద నీటితో గ్రామంలోని పంటచేలు మొత్తం మునిగిపోయాయని, మూడు రోజులు గడచినా వరద నీరు ఇంకా బయటకు పోలేదని, పంటలు పూర్తిగా నాశనమయ్యాయని రైతులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకురాలు మస్తానమ్మ, ఏవో సరిత, సిబ్బంది పాల్గొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు




ప్రేమ్‌కుమార్, విజయసారధి పురపాలక సంఘ కమిషనర్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు, పీఎఫ్ ఖాతాలు, బదిలీలు, పదోన్నతులు కల్పించాలని, పురపాలక పరిధిలో డీవైఈవో, అర్బన్ ఎంఈవో కేటాయించాలని కోరారు. అలాగే మున్సిపల్ ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. మెడికల్ బిల్లులు డీడీవో ద్వారా పంపే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షులు మోహన్‌రావు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, పట్టణశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# నష్టం అంచనాల్లో అధికారులు
## బాధితులకు సమకూరని నిత్యావసరాలు

పుత్తూరు : మిగ్‌జాం తుపాను ధాటికి కురిసిన భారీ వర్షాలు తూర్పు మండలాలను అతలాకుతలం చేశాయి. మూడ్రోజుల వర్షాలతో రైతులు పంటలు మునిగి కుదేలవగా.. ఇళ్లు కూలిపోయి.. ప్రభుత్వం నుంచి కాసింత చేయూత లభించక ప్రజలు బెంబేలెత్తిపోయారు.. అసలు తమ కు నిత్యావసరాలైనా పూర్తిగా అందుతాయో? లేదో అనే సంశయంలో ఉన్నారు.. తాజాగా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రంగంలోకి దిగి నష్ట అంచనాలు, అన్నదాతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెబుతున్నారు.. అయితే నష్ట పరిహార నివేదిక పూర్తయ్యేది ఎప్పటికి? పరిహారం అందేది ఇంకెన్నటికోనని 'తూర్పు' ప్రజలు వేకళ్ల ఎదురుచూస్తున్నారు. నగరి నియోజకవర్గం సహా పలు మండలాల్లో భారీ వర్షాల దెబ్బకు పంటలు నీట మునిగాయి. కొన్ని ఇళ్లు నేలకూలగా మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. మరికొన్నిచోట్ల నీరు ఏకంగా నివాసాల్లోకి వచ్చేసింది. గతంలో తుపాను వల్ల నష్టపోయిన బాధితులకు తక్షణ సాయం కింద నిత్యావసర వస్తువులు, కొంత నగదు అందజేసే వారు. ప్రస్తుతం అలాంటి సాయమేదీ ఇప్పటికి బాధితులకు అందనేలేదు సరికదా.. వారిని పరామర్శించి కాసింత ధైర్యం చెప్పేవారే కరవయ్యారు. తుపాను తీరం దాటి మూడ్రోజులు గడిచినా ఇళ్లు కూలిన బాధితులను పట్టించుకున్న నాథుడు లేదు. వర్షాల వల్ల ఇళ్లు కోల్పోయిన బాధితుల వివరాలు మాత్రం ఆయా పంచాయతీల వీఆర్వోలు లెక్క తేల్చి తహసీల్దార్లకు అందజేశారు. పుత్తూరు మండలంలో మొత్తం 198 ఇళ్లు దెబ్బతిన్నాయని, 197 ఇళ్లలో నీరు చేరిందని, ఒక్క ఇల్లు పాక్షికంగా కూలిందని నిర్ధరించారు. నగరి మండలంలో 87 ఇళ్లు, వరి, వేరుసెనగ, ఉద్దులు కలిసి 116 ఎకరాలు పంటలు దెబ్బతిన్నట్లు లెక్కతేల్చారు. వడమాలపేట మండలంలో 82 ఇళ్లు, నింద్రలో 184 ఇళ్లలో నీరు చేరిందని, 54 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. పంటలు 120 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఆ శాఖ అధికారులు నివేదిక



సమర్పించడం గమనార్హం. లెక్కలు తేల్చడం బాగుగన్నా.. బాధితులకు వెంటనే అందాల్సిన బియ్యం, పప్పు, నూనె తదితర సరకులు, నగదు నేటికీ ఇవ్వకపోవడమే కొసమెరుపు. చిత్తూరు, తిరుపతి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. అయితే ఒక్క మంత్రీ ఇప్పటివరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన దాఖలాల్లేవు. కనీసం బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పాలన్న ధ్యాసా లేకపోవడం గమనార్హం.

ఒక్క నగరిలో మంత్రి రోజాకు చెందిన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆమె సోదరుడు, మున్సిపల్ ఛైర్మన్, తెదేపా బాధ్యుడు గాలి భానుప్రకాష్ నిత్యావసర సరకులు అందజేయడం గమనార్హం. ప్రభుత్వ లెక్కల ప్రకారం వరి కోత దశలో నష్టపోతేనే పరిహారం అందుతుంది.

వేరుసెనగ విత్తి కాయల దశలో ఉన్న సమయంలో నష్టపోతేనే పరిహారం వస్తుంది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రభుత్వానికి నివేదించినా వరి, వేరుసెనగ పంట నష్టపోయిన రైతులకు పరిహారం దక్కే అవకాశం లేదు. ఇక అక్కడక్కడ ఉద్యాన పంటలైన పూలు, మిరప, కూరగాయలు, ఆకు కూరల పంటలు దెబ్బతిన్నాయి. వాటికైనా పరిహారం వస్తుందా అనేది సంశయంగా మారింది.

# సన్నద్ధత లేదు..సంచులూ ఇవ్వలేదు

రాజమహేంద్రవరం: ఉమ్మడి జిల్లాలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మిగ్‌జాం తుపాను మిగిల్చిన నష్టం అంతా ఇంతాకాదు. భారీ వర్షాలకు పది నుంచి వారం రోజుల ముందుగానే కోతలు పూర్తి చేసిన రైతులు నిండా మునిగిపోయారు. ఒబ్బిడి చేసిన పంటను తీసుకెళ్లండంటూ రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే)లకు వెళ్తే సంచులు ఇవ్వలేదు. తేమ పేరిట కొర్రీలు పెట్టడం.. మళ్లీ ఆరబెట్టాలని సలహాలిస్తూ వాహనాలు సమకూర్చకపోవడంతో ఇప్పుడు వేలాదిమంది తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. తుపానుకు మూడు రోజుల ముందు నుంచే రైతుల వద్ద ధాన్యం కొనుగోలుకు యంత్రాంగం చర్యలు తీసుకుని ఉంటే ఈ సమస్య నెలకొనేది కాదని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు. రైతులకు ఇచ్చే సంచులు (40 కిలోలవి) పూర్తిగా చినిగిపోవడానికి తోడు ఏ మూలకూ సరిపోని పరిస్థితి ఎదురవుతోంది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు కోసిన ధాన్యాన్ని హుటాహుటిన సమీపంలోని మిల్లులకు తరలించండి. తేమ, ఇతర నిబంధనలు పక్కన పెట్టి యుద్ధప్రాతిపదికన వాహనాలు సమకూర్చి రైతులకు నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. నేను క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లి అడిగినప్పుడు సహాయక చర్యలు బాగా చేశారని బాధితులు చెప్పాలి. పొలం కౌలుకు తీసుకుని భార్య పుస్తెలు కుదువపెట్టి కొందరు.. అధిక వడ్డీలకు అప్పులు చేసి మరికొందరు ఆశగా సాగు చేశారు. చివరికి కన్నీరే మిగిలింది. మిల్లులకు ఆర్బీకేల ద్వారా తరలించినా ఒక శాతం తేమకు కిలో చొప్పున ధాన్యం తరుగు వేస్తున్నారని, కొందరు వ్యాపారులైతే బస్తాకు రూ.1200 మాత్రమే ఇస్తామని చెబుతున్నారన్నారు. ముమ్మిడివరం మండలం కొత్తలంకకు చెందిన ఓ రైతు మాట్లాడుతూ "15 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి వేశా.. అయిదెకరాలు కోసి గట్టుమీద వేసి



వాహనం, జట్టుకూలీ డబ్బులు నేనే చెల్లిస్తానని, ధాన్యం తీసుకోమని రైతు భరోసా కేంద్రానికి వెళ్లా. డిసినందున తీసుకోలేమని, అటువంటి ఆదేశాలు తమకు రాలేదని చెప్పారు. మిల్లుకు తరలించినా బస్తాకు రూ.1000 ఇస్తారో.. రూ.500 ఇస్తారో చెప్పలేమనే సమాధానం వచ్చింది" అంటూ వెల్లడించారు కొత్తపేట మండలం అవిడిలోని జగనన్న లేఔట్‌లో 50 ఎకరాల దిగుబడులు రాశులుగా వేస్తే నీరు చేరిపోయింది. కోసిన వెంటనే స్థానిక ఆర్బీకే సిబ్బందికి చెబితే.. తేమ పేరిట కొర్రీలు పెట్టడంతో ఈ నష్టం వాటిల్లింది.

ధాన్యం విక్రయించేందుకు రైతు భరోసా కేంద్రానికి వెళ్తే సంచులు ఇవ్వడంలేదు. ట్రాక్టరు సమకూర్చడం లేదు. ఏదోలా ఈ రెండింటిని సమకూర్చి మిల్లుకు వెళ్తుంటే తేమ ఉందని 75 కిలోల బస్తాకు రెండు నుంచి మూడు కిలోలు ధాన్యం అధికంగా తీసుకుంటున్నారు. సకాలంలో ధాన్యం దించక మొలకలొచ్చేస్తున్నాయి.

# ఓటు బటన్ నొక్కుతాం.. సత్తాచాటుతాం!




రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన ఉద్ధృతం చేశారు. చర్చల పేరుతో సంఘ ప్రతినిధులను పిలుస్తున్న ప్రభుత్వం బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. అమలాపురం, రామచంద్రపురం, కొవ్వూరు, తునిలో మంత్రుల ఇళ్లు, క్యాంపు కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం నుంచి మంత్రి వేణుగోపాలకృష్ణ నివాసం వరకు సుమారు 400 మంది ర్యాలీగా వెళ్లి ముట్టడి చేపట్టారు. కంచాలపై గరిటెతో కొడుతూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.. బయటకు వచ్చిన మంత్రికి వినతిపత్రం అందజేశారు.– అమలాపురం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి భట్నవిల్లిలోని మంత్రి విశ్వరూప్ నివాసానికి ప్రదర్శనగా వెళ్లి ముట్టడించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం రిపోలీసు వలయం ఛేదించిగింది. మంత్రి అందుబాటులో లేరని పోలీసులు చెప్పగా.. ఖాళీ కుర్చీకైనా వినతిపత్రం అందజేస్తామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. పోలీసు వలయం ఛేదించి మంత్రి ఇంటి ఎదుట బైఠాయించారు. అక్కడి సిబ్బందికి వినతి ఇచ్చారు. ఎన్నికల్లో బటన్ నొక్కి తమ సత్తా ఏమిటో సీఎంకు చూపుతామన్నారు. – తుని తహసీల్దార్ కార్యాలయం నుంచి మంత్రి దాడిశెట్టి రాజా ఇంటికి ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని పోలీసులు అడ్డుకున్నారు. తాము వెళ్లి తీరుతామని వారంతా భీష్మించారు. కొందరికే అనుమతి ఇవ్వడంతో మంత్రి నివాసం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. – కొవ్వూరులో ఆర్డీవో కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ మీదుగా మంత్రి తానేటి వనిత క్యాంపు కార్యాలయానికి సిబ్బంది వెళ్తుండగా పోలీసులు నియంత్రించారు. దీంతో రోడ్డుపైనే బైటాయించి నినాదాలు చేశారు.

# ఓటు వేసి మోసపోయాం- డీఎస్సీ అభ్యర్థుల నిరసన గళం

తిరుపతి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తానని అభ్యర్థులకు ఆశపెట్టి ఓట్లు వేయించుకున్నాడని.. నాలుగున్నర సంవత్సరాలుగా డీఎస్సీ నిర్వహించకుండా అభ్యర్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు విమర్శించారు. డీఎస్సీ అభ్యర్థులు స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయం కూడలి చేరుకున్నారు. అక్కడ మానవహారం నిర్వహించి బైఠాయించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఖాళీగాఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని పాదయాత్ర సమయంలో సీఎం హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకపోవడం దారుణమన్నారు. విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానికే దక్కిందని మండిపడ్డారు. ఆడుదాం... ఆంధ్ర క్రీడల పేరుతో యువతను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ నాయకులు సంఘీభావం




ప్రకటించారు. నాయకులు రవినాయుడు, సిద్ధిక్, హేమంత్ రాయల్, కృష్ణయాదవ్, సందీప్, నరేంద్ర, తోటవాసు, వెంకటేష్ యాదవ్, ప్రసన్న, రవినాయక్, రంజిత్, శ్రీరామ్, రఫీ, గోపి పాల్గొన్నారు.

# పగలు తోడేస్తూ... రాత్రి తరలిస్తూ..



కదిరి : ప్రభుత్వం గుర్తించిన ప్రదేశాల్లో తప్ప మిగతాచోట్ల ఇసుక తరలింపును జగన్ సర్కార్ నిషేధించింది. వీటిని అడ్డుకునేందుకు ప్రత్యేకంగా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసింది. ఇదంతా ఒకవైపే. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా అన్నచందంగా అధికార పార్టీ నాయకుల అండతో వాగును తోడేస్తూ ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు కొందరు ఇసుకాసురులు. కదిరి మండలం కొండమనాయు నిపాళ్లెం వాగు నుంచి నిత్యం పదులసంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. సెబ్ అధికారులు, పోలీసులు, నీటిపారుదలశాఖ అధికారులు అడపాదడపా అక్రమార్కులపై కేసులు పెడుతున్నా.. పూర్తిగా ఆపలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పదులసంఖ్యలో కూలీలను పెట్టుకుని పట్టపగలే వాగునుంచి ఇసుకను తోడేస్తూ పక్కన నిల్వ ఉంచుతున్నారు. రాత్రివేళల్లో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తూ కాసులు పిండుకుంటున్నారు. సామాన్యుడు ఇల్లు కట్టుకుందామంటే ఇసుక అందని ద్రాక్షగా మారింది. అదే అధికార పార్టీ నాయకులకు చాలినంత ఇసుక దొరుకుతోంది. యథేచ్ఛగా తోడుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నా.. అడ్డుకునే నాథులే కనిపించడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. వాగు రూపు కోల్పోయేలా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని నీటిపారుదలశాఖ ఏఈ మహేశ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న వారిపై సెబ్ అధికారులతో పాటు కదిరి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వివరించారు.

# చేబ్రోలులో ఇళ్లు, దుకాణాల కూల్చివేత

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామ శివారు 216 జాతీయ రహదారి పక్కన సర్వే నంబరు 94లో ఉన్న 8 దుకాణాలు, రెండు ఇళ్లను వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో కూల్చివేశారు. ఘటనా ప్రాంతాన్ని తహసీల్దారు వెంకటేశ్వరరావు, పిఠాపురం సిఐ శ్రీనివాసు, ఎస్సై వినయ్‌ప్రతాప్, జడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు పరిశీలించారు. ఇళ్లలో ఉన్న తమను భయభ్రాంతులకు గురిచేసి దుర్భాషలాడుతూ ధ్వంసానికి పాల్పడ్డారని బాధితులు వాపోయారు. బద్దా నూకరాజు నుంచి డి పట్టా నిర్మించుకుని జీవిస్తున్నామని ఉలవకాయల సాంబమూర్తి తెలిపారు. చేబ్రోలు శివారు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల పక్కన ఉన్న సర్వే నంబరు 94లో 56 సెంట్ల ప్రభుత్వ



# టీమిండియాకు బిగ్ షాక్



ఇంగ్లండ్ తో టెస్ట్ సిరీస్ ప్రారంభానికి ముందే భారత్‌కు భారీ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అనూహ్యంగా ఇంగ్లండ్ తో టెస్ట్ సిరీస్ నుంచి తప్పుకున్నాడు.
వ్యక్తిగత కారణాలతో మొదటి రెండు టెస్టులకు అందుబాటులో ఉండట్లేదని కోహ్లీ సమచారం అందించాడని బీసీసీఐ ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. త్వరలో కోహ్లీ స్థానంలో మరో ప్లేయర్‌ను ఎంపిక చేస్తామని బోర్డు తెలిపింది. ఇంగ్లాండ్‌తో మొదటి రెండు టెస్టులకు ఇటీవల సెలక్షన్ కమిటీ భారత జట్టును ప్రకటించింది. ఈనెల 25 నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మొదటి టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. టెస్టు సిరీస్‌కి విరాట్ కోహ్లీ దూరం కావడానికి వ్యక్తిగత కారణాలేనని తెలుస్తోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. విరాట్ ప్రస్తుతం అయోధ్యలో ఉన్నాడు. అక్కడ అతను రామ మందిర ప్రారంభోత్సవంలో పాల్గొన్నాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్ కోసం కోహ్లీ హైదరాబాద్‌కు వచ్చాడని గతంలో వచ్చాయి. అంతేకాదు ఇక్కడి నుంచే అయోధ్యకు వెళ్లాడని తెలిసింది. అయితే ఇప్పుడు అనూహ్యంగా టెస్ట్ సిరీస్ నుంచి తప్పుకుని అందరికీ షాక్ ఇచ్చాడీ రన్ మెషిన్.

కాగా హైదరాబాద్ వేదికగా జరగనున్న తొలి టెస్టుకు విరాట్ కోహ్లీ దూరమయ్యాడన్న వార్త ఇంగ్లండ్‌కు ఊరటనిచ్చింది. హైదరాబాద్‌లో విరాట్ రికార్డులు బాగా ఉన్నాయి. ఇక్కడ టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్ కోహ్లీనే. విరాట్ కోహ్లీ ఇప్పటి వరకు హైదరాబాద్‌లో 4 టెస్టులు ఆడాడు, అందులో 1 సెంచరీతో సహా 379 పరుగులు చేశాడు. మొత్తమ్మీద భారత గడ్డపై ఇంగ్లండ్‌తో ఇప్పటివరకు ఆడిన 13 టెస్టుల్లో విరాట్ కోహ్లీ 56.38 సగటుతో 1015 పరుగులు, 3 సెంచరీలు చేశాడు.

# కన్నుల పండువగా అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ.. పునీతులైన క్రీడా ప్రముఖులు



దిగిన ఫొటోను షేర్ చేశాడు. టీమ్ ఇండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా కూడా రామజన్మభూమిలో కనిపించాడు. ప్రాణ ప్రతిష్ఠ వేడుకకు హాజరయ్యేందుకు జడేజా వచ్చిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీమిండియా మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా అయోధ్యలో ఉండడంతో ఆమె ఫొటో కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భారత మాజీ పేసర్ వెంకటేష్ ప్రసాద్ కూడా అయోధ్యలోనే ఉన్నాడు. ఈ శుభకార్యంలో పాల్గొంటున్నందుకు ఆనందంగా ఉన్న వెంకీ.. బాల రాముడి ప్రాణప్రతిష్ఠ క్షణాలను చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు. సచిన్ టెండూల్కర్

అయోధ్యలో శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ఠ వేడుక అంగరంగ వైభవంగా జరుగుతోంది. దేశ విదేశాల్లోని రామ భక్తులు ఈ చారిత్రక క్షణాలను చూస్తున్నారు. ఇక ఈ మహా క్రతువును కళ్లారా వీక్షించేందుకు పలువురు ప్రముఖులతో పాటు సామాన్యులు అయోధ్యకు చేరుకున్నారు. ప్రముఖ క్రికెటర్లతో పాటు క్రీడా ప్రముఖులూ ఉన్నారు. జనవరి 21న అయోధ్యకు వెళ్లిన టీమిండియా మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే ఇప్పుడు అయోధ్యలోనే ఉంటున్నారు. ఈ ఈవెంట్‌లో కుటుంబ సమేతంగా పాల్గొన్న కుంబ్లే.. ఇప్పుడు రామమందిరంతో

ఇప్పటికే అయోధ్య చేరుకున్నాడని, శ్రీరామప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమంలో విరాట్ కోహ్లీ కూడా పాల్గొననున్నాడని సమాచారం.
అయితే ఈ శుభకార్యక్రమంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ కనిపంచలేదు. ఇంగ్లండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్ కోసం హిట్‌మ్యాన్ ఈరోజు హైదరాబాద్‌కు వెళ్లనున్నాడని, అందువల్ల ప్రాణ ప్రతిష్ఠ వేడుకకు దూరమయ్యే అవకాశం ఉందని సమాచారం. వీరితో పాటు మహేంద్ర సింగ్ ధోనీ, సునీల్ గావస్కర్, రాహుల్ ద్రవిడ్ సహా పలువురు ఇతర ఆటగాళ్లు సైతం ఆహ్వానాలు అందుకున్నారు.

# అరుదైన లిస్టులో చేరనున్న రవీంద్ర జడేజా



ఈ సిరీస్ కోసం టీమిండియాలో చేరిన రవీంద్ర జడేజాకు ఈ టెస్ట్ సిరీస్ చాలా ప్రత్యేకమైనది. ఈ సిరీస్‌లో జడేజా కేవలం 2 వికెట్లు మాత్రమే సాధిస్తే.. ఆరుగురు భారత ఆటగాళ్లు సాధించిన ప్రత్యేక విజయాల జాబితాలో అతను కూడా చేరనున్నాడు.
భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జనవరి 25 నుంచి టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో జరగనుంది. ఈ టెస్టు సిరీస్ కోసం భారత జట్టు కూడా నేటి నుంచి ప్రాక్టీస్ ప్రారంభించింది.
ఈ సిరీస్ కోసం టీమిండియాలోకి వచ్చిన రవీంద్ర జడేజాకు ఈ టెస్టు సిరీస్ చాలా ప్రత్యేకం. ఈ సిరీస్‌లో జడేజా కేవలం 2 వికెట్లు మాత్రమే సాధిస్తే.. 6 మంది భారత ఆటగాళ్లు సాధించిన ప్రత్యేక విజయాల జాబితాలో అతను కూడా చేరతాడు.
హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియం వేదికగా భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి టెస్టు మ్యాచ్ జరగనుంది. తొలి టెస్టులో జడేజా రెండు వికెట్లు తీస్తే అంతర్జాతీయ క్రికెట్‌లో 550 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. దీంతో ఈ ఘనత సాధించిన 7వ భారత బౌలర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన భారత బౌలర్లలో అనిల్ కుంబ్లే, కపిల్ దేవ్, జహీర్ ఖాన్, హర్భజన్ సింగ్, ఆర్ అశ్విన్, జవల్నాథ్ శ్రీనాథ్ మాత్రమే ఉన్నారు.
రవీంద్ర జడేజా ఇప్పటి వరకు భారత్ తరపున 68 టెస్టులు, 197 వన్డేలు, 66 టీ20లు ఆడాడు. జడేజా ఇప్పటివరకు టెస్టుల్లో 275, వన్డేల్లో 220, టీ20ల్లో 53 వికెట్లు తీశాడు. ఇంగ్లండ్‌తో 16 టెస్టు మ్యాచ్‌లు ఆడిన జడేజా 51 వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు తొలి రెండు మ్యాచ్‌ల కోసం టీమిండియా జట్టును ప్రకటించగా, ఈ రెండు మ్యాచ్‌లకు రవీంద్ర జడేజా జట్టులో భాగమయ్యాడు. తొలి రెండు టెస్టులకు భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభమన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), కేఎస్ భరత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, ముఖేష్ కుమార్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, అవేష్ ఖాన్.

# ‘బుమ్రా గొప్పోడే కానీ...’



తన అద్భుత ప్రదర్శనకు గాను మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు 17 ఏళ్ల మఫాకాకు వరించింది. పోస్ట్ మ్యాచ్ ప్రేజెంటేషన్‌లో మఫాకా మాట్లాడుతూ.. టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రాపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ మ్యాచ్‌లో మఫాకా వికెట్ పడగొట్టిన ప్రతీసారి బుమ్రా స్టైల్‌లోనే సెలబ్రేషన్స్ జరుపుకున్నాడు. వికెట్ తీసినప్పుడు ఏ విధంగా సెలబ్రేషన్స్ జరుపుకోవాలో ప్రపంచ కప్‌కు ముందు నా సోదరుడిని అడిగాను. అతడు నాకు తెలియదు అని సమాధనమిచ్చాడు. అందుకు

సొంత గడ్డపై జరుగుతున్న అండర్-19 వరల్డ్‌కప్-2024లో దక్షిణాఫ్రికా శుభారంభం చేసిన సంగతి తెలిసిందే. వెస్టిండీస్ అండర్-19 జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 31 పరుగుల తేడాతో ప్రొటీస్ విజయం సాధించింది.
అయితే ఈ మ్యాచ్‌లో సఫారీ స్పీడ్‌స్టర్ క్వేనా మఫాకా ఐదు వికెట్లతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో 9.1 ఓవర్లు బౌలింగ్ చేసిన మఫాకా 38 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు.

బదులుగా వెంటనే నేను ‘ఐ డోంట్ నో’ సెలబ్రేషన్స్ జరుపుకుంటానని నవ్వుతూ అన్నాను.
అందుకే బుమ్రా సెలబ్రేషన్స్‌ను అనుకరించాలని నిర్ణయించుకున్నాను. బమ్రా కూడా వికెట్ పడగొట్టిన పెద్దగా సెలబ్రేషన్స్ చేసుకోడు. వరల్డ్ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్లలో బుమ్రా ఒకడు. అయితే బుమ్రా కంటే నేను బెటర్ అనుకుంటున్నా అని ఐసీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మఫాకా పేర్కొన్నాడు.

# సెంచరీతో దుమ్మురేపిన తెలుగబ్బాయి.. కట్‌చేస్తే.. శ్రీరాముడిలా విల్లు ఎక్కిపెట్టి సెలబ్రేషన్స్



జనవరి 22న అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, మహేంద్ర సింగ్ ధోనీ, కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్ వంటి క్రికెటర్లను ఆహ్వానించారు. అదే సమయంలో తాజాగా భారత వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ కేఎస్ భరత్ వీడియో సోషల్ మీడియాలో ఎక్కువగా వైరల్ అవుతోంది. నిజానికి ఇంగ్లండ్ లయన్స్‌పై కేఎస్ భరత్ అద్భుత సెంచరీ చేశాడు. ఈ సెంచరీ తర్వాత అతను ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకున్నాడు. కేఎస్ భరత్ తన సెంచరీని శ్రీరాముడికి అంకితం చేశాడు. విల్లుతో బాణం సంధిస్తున్నట్లు సెంచరీ సెలబ్రేట్ చేసుకున్నాడు. కేఎస్ భరత్ తన అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి వీడియోను పంచుకున్నాడు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఇది కాకుండా, సోషల్ మీడియా వినియోగదారులు నిరంతరం వ్యాఖ్యానాలతో తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు.
కేఎస్ భరత్ సెంచరీతో ఓటమిని తప్పించుకున్న టీం..
అదే సమయంలో, కేఎస్ భరత్ సెంచరీకి ఎంతో ప్రాధాన్యత ఉంది.

ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన తొలి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌ను టీమిండియా డ్రా చేయగలిగింది. ఫైటింగ్ సెంచరీ చేసిన తర్వాత, కేఎస్ భరత్ అభిమానులకు బ్యాట్‌ను చూపుతూ విల్లుతో బాణాన్ని వదిలినట్లు సిగ్నల్ ఇచ్చాడు. ఈ వికెట్ కీపర్ కం బ్యాట్స్‌మెన్ 165 బంతుల్లో 15 ఫోర్ల సహాయంతో 116 పరుగులు చేశాడు. ఇది కాకుండా మూడో రోజు నైట్ వాచ్‌మెన్‌గా వచ్చిన మానవ్ సుతార్ 254 బంతుల్లో 89 పరుగులతో నాటౌట్‌గా నిలిచి చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు.

# ఆస్పత్రిలో మ్యాక్స్‌వెల్.. విచారణకు ఆదేశించిన క్రికెట్ ఆస్ట్రేలియా



ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఆస్పత్రి పాలయ్యాడు. అడిలైడ్‌లో జరిగిన ఓ పార్టీలో ఫుల్‌గా తాగిన మ్యాక్సీ..
స్వల్ప అస్వస్థతో దవాఖానలో చేరాడనే వార్తలు వినిపిస్తున్నాయి. దాంతో క్రికెట్ ఆస్ట్రేలియా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. అతడిపై తక్షణ విచారణకు ఆదేశించింది. అసలేం జరిగిందటే..?

మాజీ పేసర్ బ్రెట్ లీ సభ్యుడిగా ఉన్న ‘సిక్స్ అండ్ అవుట్’ బ్యాండ్ అడిలైడ్‌లో నిర్వహించిన కన్సర్ట్‌లో మ్యాక్స్‌వెల్ పాల్గొన్నాడు. అక్కడ ఆల్కహాల్ ఎక్కువగా సేవించాడట. దాంతో, కాసేపటికే అంబులెన్స్‌లో ఈ స్టార్ బ్యాటర్‌ను ఆస్పత్రికి తరలించారు. అందుకనే మ్యాక్సీని వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు పక్కనపెట్టారని సమాచారం.
వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌కు ఆస్ట్రేలియా సెలెక్టర్లు 13 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు. ప్యాట్ కమిన్స్‌కు విశ్రాంతినిచ్చి స్టీవ్ స్మిత్ సారథిగా ఎంపిక చేశారు. ఊహించినట్టుగానే మ్యాక్స్‌వెల్, జే రిచర్డ్‌సన్‌లపై వేటు పడింది. వీళ్ల స్థానంలో జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, గ్జావియర్ బార్ట్‌లెట్‌లను ఎంపిక చేశారు. ఆసీస్, విండీస్‌ల మధ్య ఫిబ్రవరి 2న తొలి వన్డే జరుగనుంది. ఆస్ట్రేలియా స్క్వాడ్ : స్టీవ్ స్మిత్(కెప్టెన్), ట్రావిస్ హెడ్(వైస్ కెప్టెన్), సియాన్ అబాట్, గ్జావియర్ బార్ట్‌లెట్, నాథన్ ఎల్లిస్, జేక్ ఫ్రేజర్, కామెరూన్ గ్రీన్, ఆరోన్ హార్డీ, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లబూషేన్, లాన్స్ మోరిస్, మ్యాట్ షార్ట్, ఆడం జంపా.

# ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్..హైదరాబాద్‌కు చేరుకున్న ఇంగ్లాండ్ జట్టు




టీమిండియాతో 5 టెస్టుల సిరీస్ లో భాగంగా ఇంగ్లాండ్ జట్టు తొలి టెస్టు ఆడేందుకు సిద్ధమవుతుంది. జనవరి 25న హైదరాబాద్ వేదికగా ఈ టెస్టు మ్యాచ్ జరగబోతుంది.
ఈ మ్యాచ్ కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయినట్లు తెలుస్తుంది. తాజాగా (జనవరి 21) ఇంగ్లాండ్ స్క్వాడ్ హైదరాబాద్ లోకి అడుగుపెట్టింది. కోచ్ బ్రెండన్ మెకల్లమ్, ఇంగ్లండ్ జట్టు అబుదాబిలో ప్రాక్టీస్ షెడ్యూల్‌ను ముగించుకుని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు.
సొంతగడ్డపై గత 11 సంవత్సరాలుగా భారత్ టెస్టు సిరీస్ ఓడిపోలేదు. టీమిండియా చివరిసారిగా 2012 లో ఇంగ్లాండ్ చేతిలో సొంతగడ్డపై 1-2 తేడాతో సిరీస్ ఓడిపోయింది. దీంతో ఈ సిరీస్ లో భారత్ హాట్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. మరోవైపు ఇంగ్లాండ్ మాత్రం తమకు కలిసొచ్చిన బజ్ బాల్ క్రికెట్ ఆడతామని ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ సిరీస్ కు ఇంగ్లాండ్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ వ్యక్తిగత కారణాల వలన సిరీస్ మొత్తానికి దూరమవడంతో ఆ జట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి భారత పర్యటనకు ఇంగ్లాండ్ ఏకంగా నలుగురు స్పిన్నర్లను ఎంపిక చేయడం ఆసక్తికరంగా మారింది.
భారత్ రానున్న నెలన్నర పాటు ఇంగ్లాండ్ తో టెస్టులు ఆడనుంది. జనవరి 25 నుంచి ప్రారంభం కానున్న ఈ సిరీస్ మార్చ్ 11 తో ముగుస్తుంది. ఐదు టెస్టుల సిరీస్ లో భాగంగా తొలి టెస్టు హైదరాబాద్ లో జరగనుంది. విశాఖపట్నం, రాజ్‌కోట్, రాంచీ, ధర్మశాలలో వరుసగా 2,3,4,5 టెస్టులు ఆడాల్సి ఉంది. భారత్ కు రోహిత్ శర్మ, ఇంగ్లాండ్ కు బెన్ స్టోక్స్ సారథ్యం వహిస్తారు. మ్యాచ్ లన్నీ భారత కాలమాన ప్రకారం ఉదయం 9:30 నిమిషాలకు జరుగుతాయి.

# ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్..



ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) 2023-2025 సైకిల్‌లో ఫైనల్‌కు చేరుకోవాలంటే భారత్‌కు ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదు మ్యాచుల టెస్టు సిరీస్ గెలవడం ఎంతో ముఖం. జనవరి 25 నుంచి ఈ టెస్టు సిరీస్ ఆరంభం కానుంది. మొదటి టెస్టు మ్యాచ్‌కు హైదరాబాద్ వేదిక కానుంది. ఇదిలా ఉంటే.. ఈ సిరీస్‌లో పరుగుల యంత్రం, రికార్డుల రారాజు విరాట్ కోహ్లీని పలు రికార్డులు ఊరిస్తున్నాయి. ఇంగ్లాండ్ జట్టు పై కోహ్లీకి మంచి రికార్డు ఉండడంతో ఈ సిరీస్‌లోనే చాలా రికార్డులు అందుకునే అవకాశం ఉంది.

**టెస్టుల్లో 9 వేల పరుగులు..**

విరాట్ కోహ్లీ ఇప్పటి వరకు 113 టెస్టు మ్యాచులు ఆడాడు. 49.1 సగటుతో 8848 పరుగులు చేశాడు. ఇందులో 29 సెంచరీలు, 30 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. కాగా.. కోహ్లీ మరో 152 పరుగులు చేస్తే టెస్టుల్లో తొమ్మిది వేల పరుగుల మైలురాయిని చేరుకుంటాడు. టీమ్ఇండియా దిగ్గజ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్‌లు మాత్రమే ఈ ఘనత సాధించారు. వీరి సరసన విరాట్ చేరుతాడు.

**9 ఫోర్లు బాదితే..**

టెస్టు క్రికెట్‌లో 1000 ఫోర్లు కొట్టిన ఆటగాడిగా నిలవడానికి కోహ్లీకి ఇంకో 9 ఫోర్లు అవసరం. దిగ్గజ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్, లక్ష్మణ్, సునీల్ గవాస్కర్‌లు మాత్రమే వెయ్యి లేదా అంతకన్నా ఎక్కువ ఫోర్లు కొట్టిన టీమ్ఇండియా బ్యాటర్లు.
ఫోన్లో షోయబ్ మాలిక్ మొదటి పెళ్లి.. ఎలా జరిగిందో తెలుసా?

**మరో 9 పరుగులు చేస్తే..**

ఈ సిరీస్‌లో కోహ్లీ మరో 9 పరుగులు చేస్తే ఇంగ్లాండ్ జట్టు పై టెస్టుల్లో 2000 పరుగులు పూర్తి అవుతాయి. టీమ్ఇండియా ఆటగాళ్లలో ఇంగ్లాండ్ పై టెస్టుల్లో 2వేల పరుగులు చేసిన ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్‌లు మాత్రమే. కోహ్లీ ఇప్పటి వరకు ఇంగ్లాండ్‌తో 28 టెస్టులు ఆడాడు. 43.36 సగటుతో 1991 పరుగులు చేశాడు.
ఓ జట్టు పై అత్యధిక పరుగులు..
ఇంగ్లాండ్ పై మరో 52 పరుగులు చేస్తే టెస్టుల్లో ఒక జట్టు పై తాను చేసిన అత్యధిక పరుగుల రికార్డును తిరగరాయనున్నాడు. ఆస్ట్రేలియా పై 25 టెస్టులు ఆడిన కోహ్లీ 2042 పరుగులు చేశాడు.
మూడు శతకాలు బాదితే..
ఈ సిరీస్‌లో కోహ్లీ మూడు సెంచరీలు చేస్తే.. ఇంగ్లాండ్ పై అత్యధిక టెస్టు సెంచరీలు చేసిన బ్యాటర్‌గా నిలవనున్నాడు. ఇప్పటి వరకు ఇంగ్లీష్ జట్టు పై కోహ్లీ 5 శతకాలు బాదాడు. సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్‌లు ఇద్దరూ ఇంగ్లాండ్ పై చెరో 7 శతకాలు బాదారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**